ప్రతిపక్షం
www.prathipaksham.in

గురువారం 19.02.2026 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 330 పేజీలు:8 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu



అర్ధసెంచరీతో దూబే విజృంభణ 8

విద్య, ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యం

హాస్టల్ భవనాల మరమ్మతులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టండి



- దేశంలో నే మోడల్ గా అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్లు
- సంక్షేమ వసతి గృహాలు, గురుకులాల్లో అధికారుల పరిశీలన నిరంతరం జరగాలి
- లక్ష కోట్లకు పైగా నిధులతో రాష్ట్రంలో రహదారుల నిర్మాణం
- సాంస్కృతిక కార్యక్రమాలు నిరంతరం జరగాలి
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు
- ప్రీ బడ్జెట్ సమావేశాలు.. పాల్గొన్న పలువురు మంత్రులు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 18: రాష్ట్ర ప్రభుత్వం విద్య, ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యతను ఇస్తుందని, ఈ రంగాల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఎన్ని నిధులైన ఖర్చు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం వెనుకాడబోదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. బుధవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో మైనారిటీ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, రోడ్డు రవాణా, నీటిపారుదల శాఖ, సివిల్ సప్లయిస్, రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల బడ్జెట్ సమావేశాలు జరిగాయి. సమావేశాల్లో మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, అజారుద్దీన్ లతో కలిసి డిప్యూటీ సీఎం ప్రీ బడ్జెట్ సమావేశాలు నిర్వహించారు. మంత్రి అజారుద్దీన్ తో

...:: మిగతా 2లో



గ్రీన్ ఎనర్జీ విప్లవం

నెట్ జీరో స్టేట్ గా తెలంగాణ.. అందుకే క్యూర్, ప్యూర్, రేర్ విభజన

- పట్టణాభివృద్ధిలో తెలంగాణను దేశానికే ఆదర్శం
- ప్రస్తుత పరిస్థితులు క్లైమేట్ ఎమర్జెన్సీ
- విద్యుత్ఉత్పాదక వనరులే అసలైన కరెన్సీ
- తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కీలక ప్రసంగం
- ముంబయి క్లైమెట్ వీక్ కాన్ఫరెన్స్

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో

ముంబై, ఫిబ్రవరి 18: గ్రీన్ ఎనర్జీ ప్రపంచ పరిరక్షణకు లాభదాయకమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. తెలంగాణలో గ్రీన్ ఎనర్జీకి ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆయన వెల్లడించారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో గ్రీన్ ఎనర్జీని తాము ప్రోత్సాహిస్తున్నట్టు వెల్లడించారు. మహారాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన 'క్లైమేట్ వీక్' సదస్సులో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. బాంద్రా కుర్లా జియో కన్వెన్షన్ సెంటర్ లో బుధవారం ఉదయం జరిగిన ఈ సమావేశంలో దేశంలోని పట్టణాలు,

...:: మిగతా 2లో

వేసవి ముగిసేలోగా ప్రాజెక్టులు పూర్తి చేయాలి

- ప్రాజెక్టులకై భూసేకరణ త్వరితగతిన పూర్తి చేయాలి
- భూసేకరణ పూర్తయితే తక్షణమే నిధుల విడుదల
- రెండేళ్లలో నీటిపారుదల రంగంలో అద్భుతమైన పురోగతి
- ఇకపై ప్రతీ పదిరోజులకు ఒకసారి సమీక్ష
- సాగర్ ఆయకట్టుకు వారబందీ పద్ధతిలో సాగునీరు
- చివరి అంచు వరకు నీళ్లు అందేలా ప్రణాళికలు
- నిర్మాణంలో ఉన్న ఎత్తిపోతల పథకాల వద్ద ప్రత్యేక సబ్ స్టేషన్లు
- మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 18 : వేసవికాలం పూర్తి అయ్యేలోపు రాష్ట్ర వ్యాప్తంగా నిర్మాణంలో ప్రాజెక్టులను పూర్తి చేయలని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. నీటిపారుదల శాఖా చేపట్టిన ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణను సత్వరం పూర్తి చేయాలని ఆయన అధికారులకు సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టుల పురోగతితో పాటు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నిర్మాణంలో ఉన్న ఎత్తిపోతల పథకాల పురోగతిపై బుధవారం హుజర్నగర్ నియోజకవర్గ పరిధిలోని మెళ్లచెరువు మండలం మైహోం సిమెంట్ కంపెనీ ప్రాంగణంలోనీ అతిథిగృహంలో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈఎన్సీ అడ్మిన్ రమేష్ బాబు ఇతర నీటిపారుదల శాఖా

...:: మిగతా 2లో



నర్సింగ్ సిబ్బందిని వేధించొద్దు

- 150 క్రెడిట్ పాయింట్ల విధానం రద్దు చేయాలి
- నర్స్ లకు కనీస వేతనం రూ.20 వేలు అమలు చేయాలి
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 18: నర్సింగ్ సిబ్బంది మనోవేదనను అర్థం చేసుకోవాలని, క్రెడిట్ పాయింట్ల పేరుతో వారిని వేధింపులకు గురి చేయొద్దని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. క్వాలిఫైడ్ నర్స్ ల రిజిస్ట్రేషన్ రెన్యూవల్ కు ఐదేళ్లలో 150 క్రెడిట్ పాయింట్లు సాధించి ఉండాలని కొర్రీలు పెట్టడం సరికాదన్నారు. ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ ఈ నిబంధనలు తెచ్చిన తర్వాత తెలంగాణ నర్సింగ్ కౌన్సిల్ వాటిపై కనీస అవగాహన కల్పించే ప్రయత్నాలు చేయలేదని గుర్తు చేశారు. తెలంగాణ నర్సింగ్ కౌన్సిల్ నిర్లక్ష్యం వల్ల తెలంగాణలో 80 వేల మంది నర్సింగ్ సిబ్బంది తమ రిజిస్ట్రేషన్ల రెన్యూవల్ కు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. క్వాలిఫైడ్ నర్స్ లు తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడానికి ఐదేళ్లలో 150 గంటల కంటిన్యూయింగ్ నర్సింగ్ ఎడ్యుకేషన్ క్రెడిట్ అవర్స్ కలిగి ఉండాలనే నిబంధన తెచ్చినట్టు కూడా చాలా మందికి అవగాహన లేదన్నారు. ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ తీసుకువచ్చిన ఈ కొత్త నిబంధనపై తెలంగాణ నర్సింగ్ కౌన్సిల్ అవగాహన కల్పించలేదని తనను కలిసిన పలువురు నర్సింగ్ సిబ్బంది వాపోయారని తెలిపారు. 150 రిజిస్ట్రేషన్ లు రెన్యూవల్ చేస్తామంటూ తెలంగాణ నర్సింగ్ కౌన్సిల్ ఉత్తర్వులు ఇవ్వడం పూర్తిగా ఏకపక్షమే. నర్సింగ్ కేవలం వృత్తి మాత్రమే కాదు సేవ చేయడం. రాత్రి, పగలు తేడా లేకుండా ప్రజల ప్రాణాల రక్షణ కోసం సేవలందించే నర్సింగ్ సిబ్బంది రిజిస్ట్రేషన్ ల రెన్యూవల్ విషయంలో ఇలాంటి కఠిన నిబంధనలు సరికాదని,

...:: మిగతా 2లో





బాల్క సుమన్ అరెస్ట్

- క్యాతనపల్లిలో ఉద్రిక్త వాతావరణం
- పోలీసులను అడ్డుకున్న బీఆర్ఎస్ కార్యకర్తలు
- మంత్రి వివేక్ కాన్వాయ్ పై దాడి కేసులో అదుపులోకి
- నా కాన్వాయ్ పై రాళ్లు రువ్వారు: మంత్రి వివేక్ ఫైర్

ప్రతిపక్షం ప్రతినిధి, మంచిర్యాల

ఫిబ్రవరి 18: బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ను పోలీసులు అరెస్ట్ చేశారు. మంత్రి వివేక్ కాన్వాయ్ పై దాడి కేసులో మాజీ ఎమ్మెల్యేను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పెద్దఎత్తున బాల్క సుమన్ ఇంట్లోకి వెళ్లిన పోలీసులు.. అరెస్ట్కు సహకరించాలని కోరారు. ఇందుకు మాజీ ఎమ్మెల్యే ససేమిరా అనడంతో బలవంతంగా ఆయనను అరెస్ట్ చేసి పోలీస్ వ్యాన్ లో తరలించారు. అయితే బాల్క సుమన్ను అరెస్ట్ చేసేందుకు వచ్చిన పోలీసులను బీఆర్ఎస్ కార్యకర్తలు అడ్డుకున్నారు. కార్యకర్తల ఆందోళనల మధ్యే సుమన్ను పోలీసులు అరెస్ట్ చేశారు. వైద్య పరీక్షల నిమిత్తం ఆయనను ఆస్పత్రికి తరలించారు. దీంతో క్యాతనపల్లిలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కాగా, క్యాతనపల్లి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక సందర్భంగా నిన్న (మంగళవారం) ఘర్షణలు చోటుచేసుకున్నాయి. మంత్రి వివేక్ వెంకటస్వామి కాన్వాయ్ పై బీఆర్ఎస్ కార్యకర్తలు రాళ్లు రువ్వారని ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో బాల్క సుమన్ సహా పలువురు బీఆర్ఎస్ నేతలపై క్యాతనపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో మాజీ ఎమ్మెల్యేను అరెస్ట్ చేసేందుకు పోలీసులు భారీగా

...:: మిగతా 3లో



రెచ్చగొట్టి డ్రామా


- నా కాన్వాయ్ పై రాళ్లు రువ్వారు
- మంత్రి వివేక్ ఫైర్

మంచిర్యాల జిల్లా: బీఆర్ఎస్ నేత బాల్క సుమన్ తీరుపై తెలంగాణ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సుమన్ తమపై దాడి చేసి కారు అద్దాలు ధ్వంసం చేశారని

...:: మిగతా 3లో

420 హామీలు ఎక్కడ?

- రాహుల్, ఖర్గేలకు హరీశ్ రావు సవాల్
- ఢిల్లీ సమీక్షపై హరీశ్ రావు ఆగ్రహం
- కాంగ్రెస్ అగ్రనేతలకు బహిరంగ లేఖ
- తెలంగాణ ఆత్మగౌరవం దెబ్బతింటోంది కాంగ్రెస్ నాయకత్వంపై హరీశ్ విమర్శలు
- రెండున్నరేళ్ల పాలన వైఫల్యాలపై ఢిల్లీలో చర్చకు డిమాండ్



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 18: రాష్ట్ర ప్రభుత్వంపై ఢిల్లీ ద్వారా జరుపుతున్న సమీక్షపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్నికల హామీలు అమలు కాలేదని, తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా రాష్ట్రాన్ని ఢిల్లీ దర్బార్ ముందు నిలబెడుతున్నారని ఆయన


...:: మిగతా 2లో



పిల్లల సోషల్ మీడియా వాడకంపై మరిన్ని ఆంక్షలు

పిల్లలు, యువత సోషల్ మీడియా వాడకంపై త్వరలో మరిన్ని ఆంక్షలు విధించే అవకాశం ఉందని కేంద్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ అన్నారు.

7



వీసా ప్రక్రియ సులభతరం చేస్తాం

భారతీయ విద్యార్థుల కోసం వీసా, అడ్మిషన్ ప్రక్రియను సరళీకరిస్తామని, అలాగే ఫ్రాన్స్ లో ఇంగ్లీష్ మాధ్యమంలో బోధించే కోర్సులను పెంచుతామని ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ బుధవారం ప్రకటించారు.

7



దుస్తులను లాగడం అత్యాచార యత్నమే

మహిళ దుస్తులను లాగడం, వక్షోజాలను తాకడం అత్యాచార యత్నం కిందికే వస్తుందని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు కొట్టివేసింది.

7



5 శాతం ముస్లిం రిజర్వేషన్లు రద్దు

విద్యా సంస్థలు, ప్రభుత్వ, సెమీ-ప్రభుత్వ ఉద్యోగాల్లో ముస్లింలకు 5 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ 2014లో జారీచేసిన ఉత్తర్వును రద్దు చేస్తూ మహారాష్ట్ర ప్రభుత్వ సామాజిక న్యాయ శాఖ మంగళవారం ప్రభుత్వ తీర్మానాన్ని జారీచేసింది.

7

రాష్ట్రీయం

వేసవి ముగిసేలోగా ప్రాజెక్టులు పూర్తి చేయాలి

మొదటిపేజీ తరువాయి

ఇంజినీర్లు ఈ సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ నీటిపారుదల శాఖా చేపట్టిన ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ పూర్తి చేస్తే తక్షణమే రైతులకు నిధులు విడుదల చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకీ వచ్చాకా నీటిపారుదల శాఖామంత్రిగా నీటిపారుదల రంగంలో అద్భుతమైన పురోగతి సాదించామన్నారు. ధాన్యం దిగుబడిలో యావత్ భారతదేశంలోనే తెలంగాణా నమోదు చేసుకున్న రికార్డు నీటిపారుదల రంగం సాధించిన పురోగతిలో భాగమే నన్నారు. నాగార్జునసాగర్ ఆయకట్టు కింద భూములకు ఈ రబీ సీజన్లో వారబంధి పద్ధతిలో నీటి విడుదలకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. చివరి అంచు వరకు సాగు నీరు చేరేలా చర్యలు తీసుకుంటాన్నామన్నారు. నిర్మాణంలో ఎత్తిపోతల పధకాలు పూర్తి అయ్యేనాటికి కొత్త సబ్ స్టేషన్ల నిర్మాణం పూర్తిచేయాలని ఆయన అధికారులకు సూచించారు. అందుకు విద్యుత్ శాఖాధికారులతో సమన్వయం చేసుకోవాలని నీటిపారుదల శాఖాధికారులకు చెప్పారు. హుజుర్నగర్, కోదాడ నియోజకవర్గ పరిధిలో నిర్మాణంలో ఉన్న ఎత్తిపోతల పధకాలు పూర్తి అయితే లక్షా 58 వేల 300 ఎకరాల ఆయకట్టుకు సమృద్ధిగా సాగు నీరు లభిస్తుందన్నారు. వర్షాలు మొదలైతే పులిచింతల బ్యాక్ వాటర్ తో పనులకు అంతరాయం ఏర్పడుతుందన్న అంశాన్ని అధికారులు ఏజెన్సీలు పరిగణనలోకి తీసుకోవాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ప్రాజెక్టుల పురోగతి పై ఇకపై ప్రతి 10 రోజులకు ఒకమారు సమీక్షించనున్నట్టు ఆయన వెల్లడించారు.

నర్సింగ్ సిబ్బందిని వేధించొద్దు

మొదటిపేజీ తరువాయి

ఉద్యోగాలు చేస్తూ నర్సింగ్ సిబ్బంది నెలకు కనీసం రెండు కాన్ఫరెన్స్ లకు హాజరయితే తప్ప నర్సింగ్ కౌన్సిల్ నిబంధనల మేరకు క్రెడిట్ పాయింట్స్ సాధించడం సాధ్యం కాదన్నారు. కరోనా కాలంలో నర్సింగ్ కాన్ఫరెన్స్ లు నిర్వహించలేదనే విషయం తెలంగాణ నర్సింగ్ కౌన్సిల్ కు తెలియదా అని ప్రశ్నించారు. ఐదేళ్లకు 150 క్రెడిట్ పాయింట్ల విధానంపై పునరాలోచన చేయాలని డిమాండ్ చేశారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు రాష్ట్రంలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో పని చేస్తున్న నర్స్ లకు కనీస వేతనం రూ.20 వేలు అమలు చేస్తూ చట్టం చేయాలని డిమాండ్ చేశారు. నర్సింగ్ సిబ్బందిపై వేధింపులు ఆపకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

ముస్లింలకు కవిత
రంజాన్ మాస శుభాకాంక్షలు

ముస్లింలకు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత రంజాన్ మాస ప్రారంభం సందర్భంగా ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం ఆకాశంలో నెలవంక కనిపించడంతో రంజాన్ మాస వేడుకలు రంభమయ్యాయని పేర్కొన్నారు. పవిత్ర రంజాన్ మాసంలో ముస్లిం సోదర, సోదరీమణులు కఠిన ఉపవాసాలతో అల్లాహ్ పై తమ భక్తిని చాటుకుంటారని తెలిపారు. రంజాన్ మాసం సామరస్యానికి, సోదరభవానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు.


420 హామీలు ఎక్కడ?

మొదటిపేజీ తరువాయి


విమర్శించారు. 420 హామీల అమలుపై స్పష్టత ఇవ్వాలని, రైతులు-యువతకు ఇచ్చిన భరోసాలను నిలబెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. హరీశ్ రావు జాతీయ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్, కాంగ్రెస్ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు, కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దారామయ్యకు బహిరంగ లేఖ రాశారు. లేఖలో హరీశ్ రావు ప్రధానంగా తెలంగాణ ప్రభుత్వపై ఢిల్లీ కేంద్రం ద్వారా జరుపుతున్న సమీక్షపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన తెలిపారు, తెలంగాణ ప్రజలందరూ ఓట్ల ద్వారా స్వతంత్ర ప్రభుత్వం కోరారు కానీ ఇప్పుడు రాష్ట్రం ఢిల్లీ దర్బార్ ముందు కూర్చోబెట్టబడుతున్నట్టుగా ఉన్నందుకు ఆత్మగౌరవానికి దెబ్బ తగలుతోందని. ఆయన ముఖ్యంగా ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను గుర్తు చేశారు. మొదటి అసెంబ్లీ సమావేశంలో ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చారు. అయితే ఆ బిల్లులు నెరవేరక, ప్రజల విశ్వాసం మెల్లగా తగ్గిందని విమర్శించారు. వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పిన హామీలు రెండు సంవత్సరాల తర్వాత కూడా తీర్చబడలేదని, ముఖ్యమంత్రి ప్రతిపాదనలకు పక్కా మార్గదర్శకత్వం ఇవ్వాలని కోరారు. రాహుల్ గాంధీపై ఆయన శ్రద్ధ పెట్టారు, వరంగల్ రైతు డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను విస్మరించారని, రైతుల రుణమాఫీ, పంట బీమా, బోనస్, ఉపాధి హామీలు కేవలం ఆరాధనగా మిగిలాయని అన్నారు. ప్రియాంక గాంధీపై ఆయన అన్నారు, మొదటి ఏడాదిలో 2 లక్షల ఉద్యోగ నియామకాలు, నిరుద్యోగుల భృతి, విద్యార్థులకు ఇలక్ట్రిక్ స్కూటర్లు ఇస్తామని హామీ ఇచ్చినప్పటికీ ఏ ఒక్క హామీ అమలు కాలేదని, యువత, నిరుద్యోగుల నమ్మకాన్ని దెబ్బతీస్తున్నారని తెలిపారు. మల్లికార్జున ఖర్గే పై హరీశ్ రావు ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల హామీలను కూడా అమలు చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే రాష్ట్రంలో 420 హామీలలో చాలా వాటిని అమలు చేయకపోవడం, రైతులు మరియు విద్యార్థులు ఎదుర్కొంటున్న కష్టాలపై కూడా ఆయన గంభీరంగా విమర్శలు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను నిలిపివేయడం, ఫీజు రీయింబర్స్ మెంట్ నిధులు విడుదల చేయకపోవడం, వివిధ స్కాంలు ద్వారా ప్రజా ధనం దోపిడి అయ్యిన విషయం, తెలంగాణలో ప్రజా సంక్షేమం మీద ప్రభావం పడుతున్నందుకు కేంద్రం సమీక్షలో స్పందించాలి అని. అలాగే ఇల్లు ధ్వంసాలు, డబుల్ స్టాండర్డ్స్ వంటి సమస్యలపై కూడా చర్య తీసుకోవాలని, తెలంగాణ ప్రభుత్వ కార్యకలాపాలు కేవలం రాజకీయ అవసరాలకు గానే వాడబడుతున్నాయని హెచ్చరించారు. రేపు ఢిల్లీలో జరగనున్న 'రెండున్నరేండ్ల రేవంతు పాలన వైఫల్యాలుఅమలు కాని హామీలు' చర్చలో ప్రధానంగా పాల్గొని, 420 హామీలు, స్కాంలపై చర్యలు తీసుకోవాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజా గడ్డ ఎప్పుడూ కేంద్రానికి గులాం కాకుండా ఉంటుందని, రాజకీయం కోసం ప్రజా ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తే కాంగ్రెస్ చరిత్ర క్షమించదని హెచ్చరించారు. కాగా, చెన్నూరు నియోజకవర్గం క్యాతన్ పల్లి మున్సిపాలిటీ మహిళా కౌన్సిలర్ల పై జరిగిన దాడి పై చర్య తీసుకోవాలని రాష్ట్ర మహిళా కమిషన్ కు బాధిత మహిళా కౌన్సిలర్ల తో క పార్టీ ప్రతినిధుల బృందం ఫిర్యాదు చేసింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సునీతా మహేందర్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకురాలు సుశీలా రెడ్డి, సుమిత్ర నంద్, హేమ తదితరులు పాల్గొన్నారు.

పౌర సమస్యల పరిష్కారానికి 'మైక్యూర్' యాప్

- ఇక ఒకే వేదికపై జీహెచ్ఎంసీ పౌర సేవలు
- అన్ని పౌర ఫిర్యాదులకు ఏకీకృత డిజిటల్ ప్లాట్‌ఫారం
- సానిటేషన్ నుంచి టౌన్‌ప్లానింగ్ వరకు సేవలు అందుబాటులో
- రియల్‌టైమ్ ట్రాకింగ్‌తో ఫిర్యాదులకు వేగవంతమైన పరిష్కారం
- పారదర్శకత, జవాబుదారీతనంతో కూడిన పాలనకు కొత్త అడుగు



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 18 : పౌర సేవలకు ప్రాధాన్యం ఇస్తూ, నగరంలోని పౌర సేవలను సులభతరం చేసి, ఫిర్యాదుల పరిష్కారాన్ని వేగవంతం చేయడమే లక్ష్యంగా జీహెచ్ఎంసీ 'మైక్యూర్' యాప్‌ను ప్రారంభించింది. ఈ విషయాన్ని జీహెచ్ఎంసీ తన ఎక్స్ ఖాతా ద్వారా తెలిపింది. అప్లికేషన్ ప్రత్యేకతలను వెల్లడించింది. ని అధికారులు తెలిపారు. ఇప్పటివరకు అమల్లో ఉన్న 'మైజీహెచ్ఎంసీ' యాప్‌కు బదులుగా రూపొందించిన 'మైక్యూర్' యాప్ ద్వారా అన్ని పౌర ఫిర్యాదు సేవలను ఒకే వేదికపై అందుబాటులోకి తీసుకొచ్చారు. వినియోగదారులకు అనుకూలంగా రూపొందించిన ఇంటర్‌ఫేస్, ఫిర్యాదులపై తక్షణ స్థితిగతుల సమాచారం, పర్యవేక్షణ వ్యవస్థ బలోపేతం వంటి సదుపాయాలతో పారదర్శకత, బాధ్యతాయుత వ్యవస్థను నెలకొల్పడమే లక్ష్యమని వెల్లడించారు. శానిటేషన్, వీధి దీపాలు, రహదారులు, కాల్వలు, టౌన్‌ప్లానింగ్ తదితర అంశాలపై పౌరులు నేరుగా ఫిర్యాదులు నమోదు చేసుకోవచ్చు. వాటి పరిష్కార స్థితిని యాప్ ద్వారా ప్రత్యక్షంగా తెలుసుకునే వీలుంటుంది. ఫీల్డ్ స్థాయి సిబ్బంది నుంచి ఉన్నతాధికారుల వరకు సమన్వయం సాధించేలా బ్యాక్‌ఎండ్ వ్యవస్థను అనుసంధానించామని జీహెచ్ఎంసీ అధికారులు తెలిపారు. కేంద్రీకృత డ్యాష్‌బోర్డ్ ద్వారా పర్యవేక్షణ సులభమవడంతో పాటు పనితీరు అంచనా వేయడంలో కూడా ఇది దోహదపడుతుందని పేర్కొన్నారు. పౌర సేవలన్నింటినీ ఒకే డిజిటల్ వేదికపై సమీకరించే 'వన్ స్టాప్ సొల్యూషన్'గా ఈ యాప్ పనిచేస్తుందని, కార్యాలయాలకు ప్రత్యక్షంగా వెళ్లాల్సిన అవసరం తగ్గుతుందని అధికారులు వివరించారు.నగర ప్రజలు 'మైక్యూర్' యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, తమ సమస్యలను నమోదు చేసి వేగవంతమైన, పారదర్శక పరిష్కారానికి సహకరించాలని జీహెచ్ఎంసీ కోరింది. ఈ యాప్ ఆండ్రాయిడ్ (గూగుల్ ప్లే స్టోర్), ఆపిల్ ఐఓఎస్ (యాప్ స్టోర్) వేదికలపై అందుబాటులో ఉంది.



అమెరికా, చైనా వంటి దేశాలు కేవలం తాము శక్తిమంతంగా మారడమే లక్ష్యంగా పెట్టుకొని ప్రపంచానికి హాని కలిగిస్తున్నాయి. పాశ్చాత్య దేశాలు భారతీయ విద్యావ్యవస్థను తమ స్వార్థం కోసం మార్చేశాయి. ప్రపంచ సమస్యలకు పరిష్కారం చూపే సత్తా భారత్‌కే ఉంది. అయితే ఆ నిజాన్ని ప్రపంచం నమ్మాలంటే దేశం అన్నిరంగాల్లో మరింత శక్తిమంతం కావాలి.
- ఆర్‌ఎస్‌ఎస్‌చీఫ్ మోహన్ భాగవత్

గ్రీన్ ఎనర్జీ విప్లవం



మొదటిపేజీ తరువాయి

నగరాభివృద్ధి, వాతావరణ మార్పులకు అనుగుణమైన విధానాలపై ముఖ్యమంత్రి తెలంగాణ దృక్పథాన్ని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ 30 లక్షలకు పైగా పంప్‌సెట్‌లు, దాదాపు 50 లక్షల గృహాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని చెప్పారు. ఈ శక్తిని బొగ్గు, సాంప్రదాయ ఇంధన వనరుల నుంచి సోలార్, గ్రీన్ ఎనర్జీ వైపు మార్చడమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన తెలిపారు. కాలుష్య నియంత్రణ, రీసైక్లింగ్, స్థిర శక్తి ఉత్పత్తి పద్ధతులపై నిరంతరం పరిశోధనలు కొనసాగిస్తున్నామన్నారు. హైదరాబాద్‌ను 2034 నాటికి నెట్ జీరో నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. పట్టణాభివృద్ధిలో భాగంగా తాము కార్బన్ ఫుట్‌ప్రింట్ ఆడిట్ చేపట్టనున్న తొలి భారత నగరంగా హైదరాబాద్ నిలవబోతుందని తెలిపారు. వచ్చే ఐదేళ్లలో కోర్ అర్బన్ రీజియన్(క్యూర్) లో దాదాపు పరిశ్రమలు ఉండవని స్పష్టం చేశారు. దేశ పట్టణాభివృద్ధికి సంబంధించిన సదస్సులో మాట్లాడడం తనకు సంతోషంగా ఉందన్నారు. 2047 లక్ష్యాన్ని అర్థం చేసుకోవాలంటే 1947 నుంచి భారత అభివృద్ధి ప్రయాణాన్ని పరిశీలించాల్సిన అవసరం ఉందని అన్నారు. స్వాతంత్ర్యం అనంతరం తొలి నాలుగు దశాబ్దాల్లో దేశంలో ప్రధాన ప్రాధాన్యతలు విద్యా వ్యవస్థ, నీటిపారుదల రంగాలేనని గుర్తు చేశారు. గ్రామీణ ప్రాథమిక పాఠశాలల నుంచి ఐఐటీ, ఐఐఎం, ఐఐఎస్‌సీ వంటి ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలను ఏర్పాటు చేసుకున్నామని గుర్తు చేశారు. విద్యుత్, సాగునీటికి భారీ ఆనకట్టలను నిర్మించి రైతుల పొలాలను నీటితో అనుసంధానించామని తెలిపారు. 1990 నాటికి భారత్ ఆహార కొరత నుంచి ఆహార భద్రత సాధించిందని చెప్పారు. దీంతో ప్రజల జీవిత కాలం పెరిగిందని ముఖ్యమంత్రి అన్నారు. దేశంలోని ఇంజినీర్లు, వైద్యులు, శాస్త్రవేత్తలు ప్రపంచవ్యాప్తంగా అత్యుత్తమంగా గుర్తింపు పొందే విధంగా అభివృద్ధి సాధించిందని వివరించారు. 1991 నుంచి 2020 వరకు లిబరలైజేషన్, ప్రయివేటైజేషన్, గ్లోబలైజేషన్ (ఎల్‌పీజీ) సంస్కరణలతో భారత్ సేవా రంగంలో శక్తివంతమైన దేశంగా ఎదిగిందని సీఎం వివరించారు. టెలికాం , సాఫ్ట్ వేర్ విప్లవంతో పట్టణ మౌలిక సదుపాయాల విస్తరణ సాధ్యమైందని అన్నారు. భారత నిపుణులు సిలికాన్ వ్యాలీ వంటి ప్రపంచ కేంద్రాల్లో విజయాలు సాధించారని తెలిపారు. 1991 తర్వాత గ్లోబల్ సాఫ్ట్ వేర్, టెక్ సంస్థలు తమ బ్యాక్ ఆఫీస్ కార్యకలాపాలకు భారత్‌ను ఎంచుకున్నాయని అన్నారు. అందుకే ప్రపంచంలో అత్యధిక గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లు మన దేశంలో ఉన్నాయన్నారు. అయితే, ఈ టెక్ పురోగతిలో తయారీ రంగం ఎక్కువగా అవకాశాలు కోల్పోయినట్లు అభిప్రాయపడ్డారు.

విద్యుత్‌ఉత్పాదక వనరులే అసలైన కరెన్సీ..

కోవిడ్ అనంతరం ప్రభుత్వాల దృష్టికోణం మారిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రస్తుతం అభివృద్ధి వ్యూహంలో తయారీ రంగం, పర్యావరణ పరిరక్షణ, సుస్థిరత్వం కీలకంగా మారాయని అన్నారు. ఏ ఆర్థిక వ్యవస్థకైనా విద్యుత్ ఉత్పాదక వనరులే అసలైన కరెన్సీ అన్నారు. విద్యుత్ ఉత్పత్తి, వినియోగం అభివృద్ధికి కొలమానంగా నిలుస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి లక్ష్యాలను ప్రస్తావిస్తూ, రాష్ట్ర జీడీపీని 200 బిలియన్ డాలర్ల స్థాయి నుంచి 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేయడం లక్ష్యమని తెలిపారు. భవిష్యత్ అభివృద్ధికి ఆర్థిక వ్యవస్థ, పర్యావరణం, విద్య, నైపుణ్యాలు, వనరులు, ఉపాధి ప్రధాన స్తంభాలుగా నిలుస్తాయని అన్నారు. హైదరాబాద్‌ను 160కి.మీ. పొడవైన ఔటర్ రింగ్ రోడ్ పరిధిలో కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (క్యూర్) గా ప్రకటించగా, ఓఆర్ఆర్, 360 కి.మీ.ల రీజినల్ రింగ్ రోడ్ (ట్రిబుల్ ఆర్) మధ్య ప్రాంతాన్ని ఫ్యూర్ జోన్‌గా రూపొందించి తయారీ రంగానికి నిర్దేశించినట్లు చెప్పారు. ఈ ప్రాంతాన్ని దేశంలోనే అతిపెద్ద తయారీ కేంద్రంగా అభివృద్ధి చేసి "చైనా +1" ప్రత్యామ్నాయంగా తెలంగాణను నిలబెట్టడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ తయారీ వృద్ధి గ్రీన్ ఎనర్జీ ఆధారంగా సాగుతుందని స్పష్టం చేశారు.

గత ఏడాది గరిష్ట
విద్యుత్ డిమాండ్ 17,162 మెగావాట్లు

తెలంగాణ విద్యుత్ వినియోగంపై ముఖ్యమంత్రి గణాంకాలను వెల్లడించారు. రాష్ట్రం రోజుకు సగటున 16,610 మెగావాట్ల విద్యుత్ వినియోగిస్తోందని తెలిపారు. గత ఏడాది గరిష్ట డిమాండ్ 17,162 మెగావాట్లు నమోదైందని, ఈ ఏడాది అది 19,000 మెగావాట్లను దాటుతుందని అంచనాలున్నాయని వివరించారు. 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యంతో గరిష్ట డిమాండ్ 34,000 మెగావాట్లకు చేరుతుందని అంచనా వేశారు. రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తిలో సుమారు 24.8% లేదా దాదాపు 25% గ్రీన్ సోర్సుల నుంచే వస్తోందని తెలిపారు.

ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ...

అదేవిధంగా, 360 కిలోమీటర్ల పొడవు గల రీజినల్ రింగ్ రోడ్ నిర్మాణం కొనసాగుతోందని, రీజినల్ రింగ్ రైల్వే ప్రణాళికలు అమలులో ఉన్నాయని ముఖ్యమంత్రి అన్నారు. ఓఆర్ఆర్, ట్రిబుల్‌ఆర్ మధ్య ప్రాంతాన్ని ప్రధాన తయారీ జోన్‌గా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారులు, ముఖ్యంగా డేటా సెంటర్లు, పరిశ్రమలు గ్రీన్ ఎనర్జీని కోరుకుంటున్నాయని తెలిపారు. తెలంగాణ ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతున్న క్రమంలో వనరుల పెరుగుదలలో ప్రధాన భాగం గ్రీన్‌గా ఉండాలని తన సంకల్పాన్ని వ్యక్తం చేశారు.

ప్రస్తుత పరిస్థితులు క్లైమేట్ ఎమర్జెన్సీ...

వాతావరణ మార్పులు, కోవిడ్ ప్రభావాలను ప్రస్తావిస్తూ, ప్రస్తుత పరిస్థితిని క్లైమేట్ ఎమర్జెన్సీగా ముఖ్యమంత్రి అభివర్ణించారు. అభివృద్ధి, పెట్టుబడులు, ఉపాధి సృష్టి, ఉత్పత్తి , వినియోగం పెంపు కొనసాగుతూనే పర్యావరణ పరిరక్షణకు సమాన ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. తెలంగాణ మూడు జోన్‌లలో గ్రీన్ స్ట్రాటజీని అవలంబించిందని తెలిపారు. హైదరాబాద్ క్యూర్ ప్రాంతంలో ఎలక్ట్రిక్ వాహనాలపై పన్నులు తొలగించడంతో దేశంలో అత్యధికంగా ఈవీల స్వీకరణ పెరిగిందని ముఖ్యమంత్రి అన్నారు. తెలంగాణలోనే విద్యుత్ వాహనాల తయారీ కోసం సంస్థలతో చర్చలు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రజా రవాణా వ్యవస్థను పర్యావరణహితంగా మార్చే దిశగా 2 లక్షలకుపైగా ఆటోరిక్షాలను రీట్రోఫిట్ చేస్తుండగా, 3,500 కంటే ఎక్కువ ఆర్టీసీ బస్సులను ఎలక్ట్రిక్ బస్సులుగా మారుస్తున్నామని చెప్పారు. హైదరాబాద్ మెట్రోను ప్రస్తుత 71 కి.మీ. నుంచి 200 కి.మీ. పైగా విస్తరించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. పరిశ్రమలను కోర్ అర్బన్ ప్రాంతం నుంచి పెరి అర్బన్ జోన్‌లకు తరలిస్తున్నామన్నారు. పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాల్లో భాగంగా మూసీ నది పునరుద్ధరణ, సరస్సులు, చెరువుల సంరక్షణ, వాటర్ గ్రిడ్, వనరుల నిర్వహణ ప్రణాళికలను ముఖ్యమంత్రి వివరించారు. హైడ్రా (హైడ్రా) రూపంలో పర్యావరణ రక్షణకు ప్రత్యేక పోలీసు దళాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హైదరాబాద్‌లో వాతావరణ ప్రమాదాలను తగ్గించి నగరాన్ని సురక్షితమైన, వేగంగా అభివృద్ధి చెందే నగరంగా తీర్చిదిద్దుతామన్నారు. తెలంగాణను మొత్తం దేశానికి ఆదర్శంగా నిలబెట్టడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.

రంజాన్ మత సామరస్యానికి ప్రతీక

ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపిన సీఎం

పవిత్ర రంజాన్ మాసం ప్రారంభమైన సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముస్లిం సోదర సోదరీమణులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ పవిత్ర మాసంలో ముస్లింలు ఆచరించే ఉపవాస దీక్షలు, ప్రార్థనలు ఆధ్యాత్మికతను పెంపొందించడంతో పాటు క్రమశిక్షణను పెంచుతాయన్నారు. లౌకికవాదం, మత సామరస్య పరిరక్షణలో తెలంగాణ రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని సీఎం అన్నారు. ముస్లిం సోదరులు రంజాన్ మాసం సంతోషంగా జరుపుకొని, అల్లా దీవెనలు పొందాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

విద్య, ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యం

మొదటిపేజీ తరువాయి

కలిసి మైనార్టీ సంక్షేమ శాఖ సమావేశంలో డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ఆలోచించి, నిబద్ధతతో ప్రాధాన్యతను గుర్తించి, ఆదాయం ఖర్చుపై దృష్టి సారించి బడ్జెట్ ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు డిప్యూటీ సీఎం సూచించారు. సంక్షేమ శాఖకు సంబంధించి వసతి గృహాలు, గురుకులాల బిల్లులు ఎంత తొందరగా పంపితే అంత తొందరగా క్లియర్ చేస్తామని, వసతి గృహాల భవనాల మరమ్మత్తులు వేగంగా పూర్తి చేయాలని డిప్యూటీ సీఎం మైనార్టీ సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మిస్తున్నామని అన్ని వర్గాల విద్యార్థులు ఉమ్మడి కుటుంబం లా కలిసిపోవడమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. విద్యార్థులు, టీచింగ్ స్టాఫ్ కు బయోమెట్రిక్ విధానం లేకపోతే వెంటనే అమలులోకి తీసుకురావాలని వాటిని కంట్రోల్ రూమ్ కు అనుసంధానం చేయాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. వసతి గృహాలు, రెసిడెన్షియల్ బిల్డింగ్ ల పైన సోలార్ పవర్ ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపట్టాలని విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీతో సమావేశమై ఏర్పాటు చేసుకోవాలని కరెంటు భారం లేకుండా చేసుకోవడమే కాదు, సోలార్ ద్వారా ఆదాయం సృష్టించుకోవచ్చని తెలిపారు. వసతి గృహాలు, సంక్షేమ హాస్టళ్లకు డైట్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచాం కొత్త మెనూ అమల్లోకి తీసుకు వచ్చాం, వసతి గృహాల్లో అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నాం వి నేపథ్యంలో జిల్లా అధికారులు, రాష్ట్రస్థాయి అధికారులు వసతి గృహాలను సందర్శించి అన్ని విషయాలను పరిశీలించాలని వీలైతే ఒక రోజు రాత్రి అక్కడే బస చేయాలని గతంలోనే ఆదేశించాం, ఆ ప్రక్రియ ఎంత మేరకు కొనసాగుతుందో సెక్రటరీలు ఆయా జిల్లా కలెక్టర్ల ద్వారా పర్యవేక్షణ జరపాలని డిప్యూటీ సీఎం తెలిపారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి వసతి గృహాల అద్యలను క్లియర్ చేస్తున్నామని తెలిపారు. హాస్టల్ బిల్డింగుల మరమ్మతు బిల్లులు ఉంటే వెంటనే పంపాలని వెనువెంటనే క్లియర్ చేస్తామని డిప్యూటీ సీఎం తెలిపారు.

పంట మార్పిడికి అవకాశాలను పరిశీలించాలి

వరి సాగు పెద్ద ఎత్తున చేయడం, బాయిల్డ్ రైస్ ను తమిళనాడు వంటి రాష్ట్రాలు కొనుగోలు చేసే పరిస్థితి లేకపోవడం నేపథ్యంలో భవిష్యత్తులో రాష్ట్ర రైతాంగం ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉన్న నేపథ్యంలో పంట మార్పిడికి అవకాశాలను పరిశీలించాలని నీటిపారుదల శాఖ సమావేశంలో మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి సూచించారు. వరి స్థానంలో పామ్ ఆయిల్, పప్పు ధాన్యాలు సాగు చేస్తూ, పంట నిలువల స్టోరీ ఈ సామర్థ్యాన్ని రాష్ట్రంలో పెంచాల్సిన అవసరం ఉందని డిప్యూటీ సీఎం తెలిపారు.

బీసీ లకు బడ్జెట్లో ప్రాధాన్యత

తమ ప్రభుత్వం బీసీ లకు బడ్జెట్ లో ప్రాధాన్యత కల్పిస్తుంది.. బీసీ గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు గ్రీన్ చానెల్ ద్వారా డైట్ & కాస్మోటిక్ ఛార్జీలు విద్యార్థులకు స్కాలర్ షిప్ లు విడుదల చేస్తుందనీ డిప్యూటీ సీఎం తెలిపారు. గత ప్రభుత్వం గురుకుల పాఠశాలలు అద్దెలు సంవత్సరాల తరబడి పెండింగ్ లో ఉంచేదని ప్రజా పాలన ప్రభుత్వంలో ఎప్పటికప్పుడు గురుకుల పాఠశాలలు, బీసీ సంక్షేమ హాస్టల్ ప అద్దెలు చెల్లిస్తుంది. ఈసారి బడ్జెట్లో బీసీ లలో ఉపాధి అవకాశాలు మెరుగుపర్చడానికి వారి ఆర్థిక వృద్ధి సాధించడానికి ప్రత్యేక పథకాలు ప్రారంభించాలని కోరడం జరిగిందనీ బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మహా లక్ష్మీ ద్వారా ఆర్టీసీ లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం విజయవంతంగా జరుగుతుంది. ప్రభుత్వం మహా లక్ష్మీ నిధులు ఎప్పటికప్పుడు విడుదల చేస్తుంది. మహా లక్ష్మీ కి ప్రాధాన్యత ఇస్తూ రాష్ట్రంలో బస్సులు సంఖ్య కూడా గణనీయంగా పెంచడం జరుగుతుంది. త్వరలోనే ఆర్టీసీ లో ప్రయాణించే మహిళలకు మహా లక్ష్మీ కార్డులను ప్రతి ఇంటింటా పండగల అందించడం జరుగుతుందనీ పోను ప్రభాకర్ తెలిపారు.

నియోజకవర్గ కేంద్రాల్లో
అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్లు

గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు సివిల్స్, గ్రూప్స్ వంటి పోటీ పరీక్షల కోసం హైదరాబాద్ కు వచ్చి ఆర్థికంగా, ఇతరత్రా ఇబ్బందులు పడకుండా ఉండేందుకు నియోజకవర్గ కేంద్రాల్లో అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్లు ప్రారంభించే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని డిప్యూటీ సీఎం వివరించారు. దేశంలో, రాష్ట్రంలో అత్యుత్తమ ఉపాధ్యాయులను గుర్తించి హైదరాబాద్ నుంచి ఆన్లైన్లో పాఠాలు బోధిస్తారని ఇది దేశంలోనే ఒక మోడల్ గా మారబోతుందని డిప్యూటీ సీఎం తెలిపారు. లోయర్ ట్యాంక్ బండ్, కాచిగూడ కేంద్రంలో ఎస్సీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉన్న విలువైన స్థలాల్లో భారీ బవంతులు నిర్మించి విద్యార్థులకు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు భవనాలు నిర్మించే ఆలోచనలు చేయాలని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ తెలిపారు. ప్రతి మూడు నెలలకు మిస్ చార్జీలు, అద్దెలు క్లియర్ చేయడం అభినందనీయమని అడ్లూరి లక్ష్మణ్ తెలిపారు. సంక్షేమ వసతి గృహాలు, హాస్టల్లో మోడల్ కిచెన్లు ఏర్పాటు చేసే ఆలోచనను పరిశీలించాలని ఈ ప్రక్రియను దశలవారీగా ప్రారంభించాలని సాంఘిక సంక్షేమ శాఖ అధికారులకు డిప్యూటీ సీఎం సూచించారు. లక్ష కోట్లకు పైగా నిధులతో రాష్ట్రంలో రహదారుల నిర్మాణం జరుగుతుందని డిప్యూటీ సీఎం తెలిపారు. హమ్, ట్రిబుల్ ఆర్ , హైదరాబాద్ విజయవాడ, ఫ్యూచర్ సిటీ నుంచి బందర్ పోర్టు, రావిర్యాల నుంచి శ్రీశైలం వరకు రహదారుల నిర్మాణం పనులు వివిధ దశలో ఉన్నాయన్నారు. రాష్ట్రంలో రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణానికి హడ్కో నుంచి రుణం తీసుకునేందుకు డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క ప్రీ బడ్జెట్ సమావేశంలో సంతకం చేసి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినందుకు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అభినందనలు తెలిపారు. రాష్ట్రంలో, ప్రధానంగా హైదరాబాద్ కేంద్రంలో సంవత్సరం పొడుగునా కల్చరల్ యాక్టివిటీ కొనసాగేలా సినిమాటోగ్రఫీ శాఖలో ప్రణాళిక రూపొందించాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. సమావేశంలో ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, సంక్షేమ శాఖల స్పెషల్ చీఫ్ సెక్రటరీ సవ్యసాచి ఘోష్, రవాణా, రోడ్లు భవనాల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, నీటిపారుదల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ రాహుల్ బొజ్జ, సివిల్ సప్లై శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, సంక్షేమ శాఖ కమిషనర్ కృష్ణ ఆదిత్య, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్, సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో అర్హులందరికి ఇందిరమ్మ ఇళ్లు

- రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్.
- ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతో ప్రత్యేక సమావేశం



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 18: హైదరాబాద్ జిల్లాలో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తామని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. బుధవారం సచివాలయంలోని తన ఛాంబర్ నందు రాష్ట్రమైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మొహమ్మద్ అజారుద్దీన్, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక, రెండు పడకల గదుల ఇండ్లపై మంత్రి సమీక్షించారు. ఈ సమావేశంలో హైదరాబాద్ జిల్లాకు చెందిన ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం పేదల ఇళ్ల మంజూరీలో పారదర్శకతగా వ్యవహరిస్తుందని అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు నిర్మించి అందించటమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఎల్ వన్ కింద 4800 మంది అర్హులైన ఇళ్ల స్థలాలు ఉన్న పేదలకు రెండు పడకల గదుల ఇల్లు నిర్మించుటకై నిధులు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. అలాగే ఎల్ టు (L2) కింద హైదరాబాద్ జిల్లాలో నాలుగు లక్షల ఇరవై రెండు వేలకు పైగా దరఖాస్తులు వివిధ నియోజకవర్గాల నుండి పేద ప్రజలు అందజేశారని మంత్రి వివరించారు. హైదరాబాద్ మహానగరంలో స్థలాలు సేకరించి జీ + 510 వరకు ఇందిరమ్మ ఇల్లు చేపట్టే ఆలోచనలో ప్రభుత్వం ఉందని మంత్రి వివరించారు.. పెండింగ్ లో ఉన్న 2 బీహెచ్‌కే ఇల్లు పనులు పూర్తి చేసి అర్హులకు అందించాలని అధికారులకు సూచించారు. ఎక్కడెక్కడ ఖాళీలు ఉన్నాయి.. లబ్ధిదారులు ఎంత మంది తదితర వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో 2 బీహెచ్ కె లబ్ధిదారులకు అందించమని ఇంకా పెండింగ్ పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మురికివాడల్లో ఇందిరమ్మ మోడల్ కాలనీలు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి స్థలాల సేకరణ,అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణాలు పూర్తి, పూర్తయిన ఇండ్ల కేటాయింపు తదితర అంశాలపై శాసనసభ్యులతో కలిసి మంత్రులు సమీక్షించారు.తదుపరి హైదరాబాద్ జిల్లా పరిధిలోని నియోజకవర్గాల శాసనసభ్యుల అభిప్రాయాలను ఈ సందర్భంగా స్వీకరించి చేపట్టే అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్ వి కర్ణన్, జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి, పిడి హౌసింగ్ అశోక్ చక్రవర్తి, ఆర్డీవోలు రామకృష్ణ, సాయిరాం హౌసింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

'త్రీ ట్రిలియన్' లక్ష్య సాధనలో
లైఫ్ సైన్సెస్ కీలకం

- దేశ జీడీపీలో మన వాటాను 10 శాతానికి పెంచేందుకే "తెలంగాణ రైజింగ్ 2047" కు శ్రీకారం
- బయో ఏషియా 2026 ముగింపు వేడుకలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 15: తెలంగాణను గ్లోబల్ లైఫ్ సైన్సెస్ పవర్‌హౌస్‌గా మార్చాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని, ఆ దిశగా చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. లైఫ్ సైన్సెస్ రంగంలో కేవలం రెండేళ్లలోనే (డిసెంబర్ 2023 జనవరి 2026) రూ. 73,360 కోట్ల పెట్టుబడులు ఆకర్షించి, లక్ష ఉద్యోగాలను సృష్టించామని వివరించారు. బుధవారం హైటెక్స్‌లో "బయో ఏషియా 2026" సదస్సులో భాగంగా "తెలంగాణ రైజింగ్ 2047: బిల్డింగ్ ఏ వరల్డ్ క్లాస్ లైఫ్ సైన్సెస్ ఎకో సిస్టం" పేరిట నిర్వహించిన ఫైర్ సైడ్ చాట్, ముగింపు వేడుకలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచాలనే లక్ష్యంతోనే ప్రజలు, నిపుణుల భాగస్వామ్యంతో "తెలంగాణ రైజింగ్ 2047"కు శ్రీకారం చుట్టామన్నారు. 2047 నాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 3 ట్రిలియన్ డాలర్లకు చేర్చాలనే లక్ష్య సాధనలో కీలక పాత్ర పోషించేలా లైఫ్ సైన్సెస్ రంగం ఎకో సిస్టంను మరింత బలోపేతం చేసేందుకు సమగ్ర ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. అందులో భాగంగానే.... తెలంగాణ నెక్స్ట్ జెన్ లైఫ్ సైన్సెస్ పాలసీ(2026 2030), తెలంగాణ లైఫ్ సైన్సెస్ స్కూల్, 1బయో ఇంక్యూబేటర్, జీనోమ్ వ్యాలీ విస్తరణ, ఫార్మా విలేజెస్, తెలంగాణ లైఫ్ సైన్సెస్ ను మరింత బలోపేతం చేసేందుకుప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, అంతర్జాతీయ భాగస్వామ్యం, నైపుణ్యం కలిగిన మానవ వనరుల తయారీకి శ్రీకారం చుట్టామన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 2,000కు పైగా లైఫ్ సైన్సెస్ సంస్థలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని, జాతీయ ఫార్మా ఉత్పత్తుల్లో మూడో వంతు, ఎగుమతుల్లో అయిదో వంతు వాటా తెలంగాణదే కావడం మనకు గర్వకారణమన్నారు. ఈ ఏడాది సదస్సులో సనోఫీ, ఒపెల్లా, వ్యాక్సిండో యానిమల్ హెల్త్, ట్రైడెన్స్, ఆర్ఎక్స్ ప్రొపెల్లెంట్ వంటి దిగ్గజ సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు ముందుకొచ్చాయన్నారు. బ్రిటన్, న్యూజిలాండ్, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా, జపాన్, యూకే తదితర దేశాల నిపుణులతో లైఫ్ సైన్సెస్ రంగంలో రాబోయే రోజుల్లో ఎదురయ్యే సవాళ్లు, అనుసరించాల్సిన వ్యూహాలపై నిర్వహించిన ప్రత్యేక రౌండ్ టేబుల్ సమావేశాలు తెలంగాణ బ్రాండ్ ను మరింత విశ్వవ్యాప్తం అయ్యేందుకు దోహదం చేస్తాయన్నారు. 'బయో ఎకానమీ' రంగంలో మూడో అతిపెద్ద శక్తిగా ఎదగడానికి భారత్ కు ఉన్న అవకాశాలు, తెలంగాణ పాత్రపై చర్చించి, ప్రత్యేక కాంప్రహెన్సివ్ రోడ్ మ్యాప్ ను సిద్ధం చేసేందుకు వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్‌తో కలిసి ప్రత్యేక చర్చా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. లైఫ్ సైన్సెస్ రంగాన్ని తమ ప్రభుత్వం కేవలం వ్యాపారంగా మాత్రమే చూడటం లేదని, ఒక సామాజిక బాధ్యతగా చూస్తున్నామన్నారు. అన్ని రకాలుగా పారిశ్రామికాభివృద్ధికి అనుకూలంగా ఉన్న రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టి రైజింగ్ తెలంగాణలో భాగస్వామ్యం కావాలని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు పారిశ్రామికవేత్తలకు విజ్ఞప్తి చేశారు.

పోరాడి సాధించుకున్న తెలంగాణలో పాలమూరుకు అన్యాయమే

- లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మిస్తేనే వలసలు ఆగుతాయి
- సదస్సులో ప్రొఫెసర్ హరగోపాల్



ప్రతిపక్షం, షాద్‌నగర్, ఫిబ్రవరి 18: సాగు త్రాగునీటి విషయంలో పాలమూరు జిల్లాకు అడుగడుగునా అన్యాయమే జరుగుతుందని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. బుధవారం రంగారెడ్డి జిల్లా షాద్నగర్ పట్టణంలోని పెన్షనర్ భవన్ లో ఏర్పాటు చేసిన 'లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్ నిర్మాణం ఎందుకు చేపట్టడం లేదు' అనే అంశంపై జరిగిన సదస్సులో ఆయన ప్రసంగించారు. పాలమూరు జిల్లా మీది నుండి కృష్ణానది ప్రవహిస్తున్న జిల్లాకు సాగునీరు త్రాగునీరు మాత్రం అందడం లేదని, రాజకీయ నాయకులు ప్రతి ఎన్నికలలో కూడా తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు, రాష్ట్రం ఏర్పడ్డాక పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగమైన లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మిస్తామని చెప్పిన వాళ్లేకానీ, ఇప్పటివరకు లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్లు నిర్మాణం చేపట్టలేదని అన్నారు. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మించాలని ఇప్పటివరకు ఎన్నోసార్లు పాలమూరు ఆధ్యయన వేదిక ఎన్నోసార్లు రకరకాల నిరసన కార్యక్రమాలు, పాదయాత్రలు, మంత్రులకు, డిప్యూటీ సీఎంకు సైతం మెమోరండాలు అందజేయడం జరిగిందని, అయినా ఆ రిజర్వాయర్ నిర్మాణం చేపట్టడం లేదని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో కూడా డిజైన్లు మార్చారే తప్ప రిజర్వాయర్ నిర్మాణం చేపట్టలేదని, ఆ తర్వాత అధికారంలోకి వస్తే లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణం చేపడతామని చెప్పిన కాంగ్రెస్ నేతలు కూడా ఇప్పటివరకు పనులు చేపట్టడం లేదని, రిజర్వాయర్ నిర్మాణంపై ప్రజలు గట్టిగా పోరాడితే తప్ప, నీళ్ల కరువు ఏర్పడే పరిస్థితి ఉందని అన్నారు. ఇప్పటికే పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం నుండి కాలువల ద్వారా నల్గొండకు నీళ్లు తరలించే ప్రయత్నం జరుగుతుందని, దీనిపై ప్రజలు చైతన్యవంతంగా పోరాడాలని పిలుపునిచ్చారు లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్ నిర్మిస్తే తప్ప వలసలు ఆగవని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక శాస్త్రవేత్త డి.నరసింహారెడ్డి, పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవాచారి, పౌర హక్కుల సంఘం రాష్ట్ర సహకారదర్శి తిరుమలయ్య, రవీంద్రనాథ్, అర్జునప్ప, టీజీ. శ్రీనివాస్, మందారం నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్మన్ ఎన్నికలో తుదినిర్ణయం ఆర్‌వోదే

- ఇబ్రహీంపట్నం మున్సిపల్ పీఠంపై విధించిన స్టే ఎత్తివేత
- బీఆర్ఎస్ కౌన్సిలర్ యాదగిరిని హైకోర్టులో హాజరుపర్చిన పోలీసులు
- బీఆర్ఎస్ తరపున మున్సిపల్ చైర్మన్ రేసులో ఉన్నానన్న యాదగిరి



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 18: ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్ ఎన్నికకు అడ్డంకి తొలగింది. మున్సిపల్ చైర్మన్ ఎన్నికలో తుదినిర్ణయం ఆర్‌వోదేనని హైకోర్టు స్పష్టం చేసింది. బీఆర్ఎస్ కౌన్సిలర్ యాదగిరి పై ఎలాంటి ఒత్తిడి తీసుకురావొద్దని రంగారెడ్డి కలెక్టర్, పోలీసులను హైకోర్టు ఆదేశించింది. యాదగిరి స్వచ్ఛందంగా వ్యవహరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తూ హెబియస్ కార్పస్ పిటిషన్‌పై విచారణ ముగించింది. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపల్ పీఠంపై విధించిన స్టేను హైకోర్టు ఎత్తివేసింది. ఛైర్మన్ ఎన్నికపై తుది నిర్ణయం ఆర్వోదేనని స్పష్టం చేసింది. మంగళవారం మున్సిపల్ కౌన్సిలర్ల ప్రమాణ స్వీకారం, ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నిక వేళ తన తండ్రి కనిపించడం లేదని 19వ వార్డు నుంచి గెలుపొందిన యాదగిరి కుమారుడు హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. దీంతో ఈ ఎన్నికపై విచారణ చేపట్టిన హైకోర్టు స్టే విధించింది. బుధవారం విచారణకు యాదగిరిని కోర్టులో హాజరుపరచాలని మంగళవారం హైకోర్టు పోలీసులను ఆదేశించింది. ఈ క్రమంలో కోర్టులో విచారణకు కౌన్సిలర్ యాదగిరి హాజరయ్యారు. మంగళవారం హైకోర్టు స్టే ఉత్తర్వులు అందే సమయానికి మున్సిపల్ చైర్మన్‌గా బీఆర్ఎస్ అభ్యర్థి ఎన్నికైనా కూడా న్యాయస్థానం స్టే కారణంగా ఎన్నికల అధికారి అతనికి ధ్రువీకరణపత్రం ఇవ్వలేదు. 19 వార్డు కౌన్సిలర్ ఆకుల యాదగిరి అపహరణకు గురయ్యాడని ఆయన కుమారుడు హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ వేయడం, అనూహ్యంగా కౌన్సిలర్ యాదగిరి బీఆర్ఎస్ క్యాంపులో కౌన్సిల్ ఎన్నికకు హాజరవటం వంటి పరిణామాల మధ్య హైకోర్టు ఎన్నికపై స్టే విధించింది. అంతకు ముందు ఇబ్రహీంపట్నం మున్సిపల్ కార్యాలయంలో ఉద్రిక్తత నెలకొంది. కౌన్సిల్ హాలులో బీఆర్ఎస్, కాంగ్రెస్ కౌన్సిలర్లు పరస్పర దాడులు చేసుకున్నారు. రహస్య ఓటింగ్ చేయాలని కాంగ్రెస్ కౌన్సిలర్లు డిమాండ్ చేయగా నిబంధనల ప్రకారమే ఓటింగ్ నిర్వహించాలని బీఆర్ఎస్ కౌన్సిలర్లు పట్టుబట్టారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం, పరస్పర దాడులు చోటు చేసుకున్నాయి. ఎన్నికకు ఎక్స్ అఫీషియో సభ్యుడు మల్ రెడ్డి రంగారెడ్డి గైర్హాజరయ్యారు.

బౌన్సర్లను పెట్టి ఇబ్బందులకు గురిచేశారు

హైకోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో బుధవారం బీఆర్ఎస్ కౌన్సిలర్ యాదగిరిని ఇబ్రహీంపట్నం ఉదయం పోలీసులు హైకోర్టులో హాజరుపర్చారు. మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, కుమారుడు బలవంతంగా బాపట్ల జిల్లా చీరాల తీసుకెళ్లినట్లు యాదగిరి కోర్టుకు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ బీసీ అభ్యర్థిగా మున్సిపల్ చైర్మన్ రేసులో ఉన్నాననే బౌన్సర్లను పెట్టి మానసికంగా, శారీరకంగా ఇబ్బందులకు గురిచేశారని అన్నారు. ఈనెల 16న ఉదయం నుంచి రాత్రి వరకు కారులోనే తిప్పారని వాపోయారు. తనకు బీపీ, షుగర్ ఉన్నా భోజనం కూడా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేసిన కౌన్సిలర్ యాదగిరి తాను లేకపోతే కోరమ్ ఉండదని భావించే ఈ పని చేశారన్నారు. తాను కనిపించకపోవడంతో తన కుమారుడు పిటిషన్ వేశారని కోర్టులో తెలిపారు. తన మొబైల్ ఫోన్ కూడా మాజీ ఎమ్మెల్యే కుమారుడు ప్రశాంత్ రెడ్డి దగ్గరే ఉందని యాదగిరి కోర్టుకు తెలిపారు. తనకు వారి నుంచి ప్రాణహాని ఉందని భద్రత కల్పించాలని కోరారు. అనారోగ్యం ఉన్నందున రెండు రోజులు ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటానని విజ్ఞప్తి చేశారు. ఛైర్మన్ ఎన్నిక విషయంలోనే యాదగిరి మాట మారుస్తున్నారని మాజీ ఎమ్మెల్యే కిషన్ రెడ్డి తరపున న్యాయవాది కోర్టుకు తెలిపారు. బీఆర్ఎస్ చైర్మన్ అభ్యర్థికి ఇప్పటికే 15 మంది అభ్యర్థుల మద్దతు ఉందని, చట్ట ప్రకారం చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక సకాలంలో జరగాలన్న మాజీ ఎమ్మెల్యే కిషన్ రెడ్డి తరపు న్యాయవాది వాదనలు వినిపించారు. ఇరుపక్షాల వాదనలను పరిశీలించిన న్యాయస్థానం ఇబ్రహీంపట్నం మున్సిపల్ ఛైర్మన్ ఎన్నిక నిర్ణయం ఆర్‌వోదేనని స్పష్టం చేసింది



స్పష్టమైన ప్రణాళికతో వార్షిక బడ్జెట్

- రాష్ట్ర అభివృద్ధిలో రోడ్లు, భవనాల శాఖ కీలకం
- అధికారులను ఆదేశించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి
- బడ్జెట్ ప్రతిపాదనలపై సమీక్షా సమావేశం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి18: రోడ్లు, భవనాల శాఖ 2026-27 వార్షిక బడ్జెట్ ప్రతిపాదనలపై తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సచివాలయంలో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, ఈఎన్సీలు మోహన్ నాయక్, జయ భారతి, సీఈలు శ్రీనివాస్ రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, వసంత్ నాయక్, బీవీ రావు, లింగారెడ్డి, నర్సింగ్‌రావు, పలువురు ఆర్ అండ్‌బీ అధికారులు హాజరయ్యారు. గత ఏడాది బడ్జెట్, పనుల పురోగతి, విడుదలైన నిధులపై కూలంకషంగా మంత్రి కోమటిరెడ్డి చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో రోడ్లు, భవనాల శాఖ కీలక పాత్ర పోషిస్తోందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వ్యాఖ్యానించారు. స్పష్టమైన ప్రణాళికతో వార్షిక బడ్జెట్ అంచనాలు ఉండాలని అధికారులను ఆదేశించారు. రీజినల్ రింగ్ రోడ్డు లాంటి గేమ్ చేంజర్ ప్రాజెక్టులపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని దిశానిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో 2047 రైజింగ్ తెలంగాణ నినాదంలో రాష్ట్ర రోడ్ నెట్‌వర్క్ అభివృద్ధి.. అత్యంత కీలకమని చెప్పుకొచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర రోడ్ నెట్‌వర్క్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. 'హ్యామ్' రోడ్ల నిర్మాణంతో రాష్ట్రవ్యాప్తంగా అద్దం లాంటి రోడ్లు నిర్మించబోతున్నామని తెలిపారు.

కేంద్ర మంత్రులను కలుస్తా..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధుల వాటాపై కన్ఫ్యూజన్ లేకుండా పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. హైదరాబాద్ విజయవాడ (ఎన్‌హెచ్ 65) 8వ లైన్ విస్తరణ పనులు కూడా త్వరలో ప్రారంభం కానున్నాయని వివరించారు. ఈ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కలిసి మరోసారి కోరతామని అన్నారు. తెలుగు రాష్ట్రాల ప్రజలకు ఎంతో ఉపయోగకరమైన రోడ్డు ఇదని... ఇది పూర్తయితే హైదరాబాద్ నుంచి విజయవాడ రెండున్నర గంటల్లో చేరుకోవచ్చని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిలో భాగంగా కేంద్రప్రభుత్వం సహకారం అందించే ఆయా ప్రాజెక్టుల్లో వేగం పెంచాలన్నారు. ఈ విషయంలో తాను కేంద్ర మంత్రులను కలుస్తానని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు.

తెలుగు రాష్ట్రాల్లో కోర్టులకు బాంబు బెదిరింపులు

- నాంపల్లి, కరీంనగర్, రాజమహేంద్రవరం, అనంతపురం కోర్టులకు బెదిరింపులు
- పోలీసుల అప్రమత్తం.. ఆయా కోర్టులతో తనిఖీలు



ప్రతిపక్షం, హైదరాబాద్, ఫిబ్రవరి 18: తెలుగు రాష్ట్రాల్లోని పలు కోర్టులకు బుధవారం బాంబు బెదిరింపులు వచ్చాయి. హైదరాబాద్‌లోని నాంపల్లి, కరీంనగర్, రాజమహేంద్రవరం, అనంతపురం కోర్టులకు బెదిరింపులు వచ్చాయి. దీంతో ఆయా కోర్టుల్లో బాంబ్, డాగ్ స్క్వాడ్ బృందాలతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం కోర్టుకు బుధవారం బాంబు బెదిరింపు కాల్ వచ్చింది. కోర్టు సిబ్బంది త్రీ టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసుల కోర్టు ప్రాంగణంలో బాంబు, డాగ్ స్క్వాడ్‌లతో ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఈ కాల్ ఎక్కడి నుంచి వచ్చిందనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు కోర్టులో ఎక్కడా బాంబు లభ్యం కాలేదు. దీంతో ఈ ఫోన్ కాల్ ఆకతాయి చేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. మరోవైపు అనంతపురం కోర్టుకూ ఇదే తరహా ఫోన్ కాల్ వచ్చింది. ఇక తెలంగాణలో పలు కోర్టులకు ఈమెయిల్స్ ద్వారా బాంబు బెదిరింపులు అందాయి. ఆ జాబితాలో నాంపల్లి కోర్టు ఉంది. మధ్యాహ్నం 12.05 గంటలకు కోర్టుల్లో బాంబు పేలుతుందంటూ ఈ మెయిల్‌లో అగంతకులు పేర్కొన్నారు. దాంతో కోర్టులో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. అలాగే కరీంనగర్ కోర్టులో సైతం తనిఖీలు కొనసాగుతున్నాయి. గతంలో సైతం ఇదే తరహాలో కోర్టులకు బాంబు బెదిరింపులు వచ్చాయి. అయితే మళ్లీ అలాగే బాంబు బెదిరింపులు రావడంతో పోలీసులు వెంటనే అప్రమత్తమయ్యారు. దాంతో కోర్టుల్లో బాంబు, డాగ్ స్క్వాడ్‌తో ముమ్మర తనిఖీలు చేపట్టారు.

బాల్క సుమన్ అరెస్ట్

మొదటిపేజీ తరువాయి

తరలివచ్చారు. ఆయన నివాసం చుట్టూ వందలాది మంది బీఆర్ఎస్ కార్యకర్తలు చేరుకుని అరెస్టును అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో పోలీసులు, కార్యకర్తల మధ్య తోపులాట, ఉద్రిక్తత నెలకొంది. చివరకు బీఆర్ఎస్ శ్రేణులను చెదరగొట్టిన పోలీసులు సుమన్‌ను అరెస్ట్ చేశారు.

నా కాన్వాయ్ పై రాళ్లు రువ్వారు: మంత్రి వివేక్ ఫైర్

మంచిర్యాల జిల్లా: బీఆర్ఎస్ నేత బాల్క సుమన్ తీరుపై తెలంగాణ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సుమన్ తమపై దాడి చేసి కారు అద్దాలు ధ్వంసం చేశారని ధ్వజమెత్తారు. ఇది ఏం పద్ధతని.. ఈ విషయంలో బాల్క సుమన్‌ని హరీశ్‌రావు సమర్థిస్తారా అని ప్రశ్నించారు. బుధవారం క్యాతనపల్లిలో మీడియాతో మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడారు. క్యాతనపల్లెలో ఎలాంటి సమస్య లేదని స్పష్టం చేశారు. సుమన్ దౌర్జన్యం అందరూ చూశారన్నారు. సుమన్ ఆరోపణలన్నీ అబద్ధాలేనని మండిపడ్డారు. ఆయన రెచ్చగొట్టి డ్రామాలు చేస్తున్నారని ఆగ్రహించారు.

బాల్కసుమన్ మా మీద రాళ్లు విసిరారు..

మొదటిరోజు కోరం లేకపోవడంతో క్యాతనపల్లిలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎంపికని వాయిదా వేశామని మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. రెండోరోజు బయటి వాళ్లు వచ్చి గొడవ చేశారని చెప్పుకొచ్చారు. అనవసర గొడవ కారణంగా రెండోరోజు వాయిదా పడిందని అన్నారు. ఎన్నిక ప్రాసెస్‌ను తాము అడ్డుకోలేదని స్పష్టం చేశారు. బాల్కసుమన్ తమ మీద రాళ్లు విసిరారని, దాడి చేశారని ఆరోపణలు చేశారు. రెండురోజులుగా సుమన్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. కేసీఆర్ హయాంలో చెన్నూరు, క్యాతనపల్లెలో సరిగా ఎన్నికలు జరగలేదని, గుండాయిజంతో మున్సిపల్ ఎన్నికలు ఏకగ్రీవం చేశారని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో అధికార దుర్వినియోగం చేశారని విమర్శించారు. బీఆర్ఎస్ నేతలు క్యాంపు పెట్టుకుంటే ఎక్కడైనా తాము గొడవ చేశామా అని మంత్రి వివేక్ వెంకటస్వామి ప్రశ్నల వర్షం కురిపించారు. తాము ఎలాంటి అధికార దుర్వినియోగం చేయలేదని తేల్చిచెప్పారు. మంత్రి, ఎంపీ కార్లపై రాళ్లు విసరడం సరైనదైనా అని నిలదీశారు. తమపై దాడిని ఖండిస్తున్నామని అన్నారు. బీఆర్ఎస్ నేతలు ఇంకా అధికారంలో ఉన్నట్లుగా వ్యవహరిస్తున్నారని ఫైర్ అయ్యారు. బీఆర్ఎస్ అభ్యర్థి ఓడిపోయినా బాధలో బాల్క సుమన్ తమపై ఫ్రస్టేషన్ చూపుతున్నారని ఫైర్ అయ్యారు. హరీశ్‌రావుకు ప్రజాస్వామ్యంపై గౌరవం ఉంటే సుమన్ తమపై చేసిన దాడిని ఖండించాలని అన్నారు. తాము చెన్నూరులో ఏరోజు బీఆర్ఎస్‌పై దాడి చేయలేదని, ఎవరినీ అరెస్ట్ చేయలేదని మంత్రి వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు.

రెచ్చగొట్టి డ్రామా

మొదటిపేజీ తరువాయి

ధ్వజమెత్తారు. ఇది ఏం పద్ధతని.. ఈ విషయంలో బాల్క సుమన్‌ని హరీశ్‌రావు సమర్థిస్తారా అని ప్రశ్నించారు. ఇవాళ (బుధవారం) క్యాతనపల్లిలో మీడియాతో మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడారు. క్యాతనపల్లెలో ఎలాంటి సమస్య లేదని స్పష్టం చేశారు. సుమన్ దౌర్జన్యం అందరూ చూశారన్నారు. సుమన్ ఆరోపణలన్నీ అబద్ధాలేనని మండిపడ్డారు. ఆయన రెచ్చగొట్టి డ్రామాలు చేస్తున్నారని ఆగ్రహించారు.


బాల్కసుమన్ మా మీద రాళ్లు విసిరారు..

మొదటిరోజు కోరం లేకపోవడంతో క్యాతనపల్లిలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎంపికని వాయిదా వేశామని మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. రెండోరోజు బయటి వాళ్లు వచ్చి గొడవ చేశారని చెప్పుకొచ్చారు. అనవసర గొడవ కారణంగా రెండోరోజు వాయిదా పడిందని అన్నారు. ఎన్నిక ప్రాసెస్‌ను తాము అడ్డుకోలేదని స్పష్టం చేశారు. బాల్కసుమన్ తమ మీద రాళ్లు విసిరారని, దాడి చేశారని ఆరోపణలు చేశారు. రెండురోజులుగా సుమన్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. కేసీఆర్ హయాంలో చెన్నూరు, క్యాతనపల్లెలో సరిగా ఎన్నికలు జరగలేదని, గుండాయిజంతో మున్సిపల్ ఎన్నికలు ఏకగ్రీవం చేశారని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో అధికార దుర్వినియోగం చేశారని విమర్శించారు.

అధికార దుర్వినియోగం చేయలేదు..

బీఆర్ఎస్ నేతలు క్యాంపు పెట్టుకుంటే ఎక్కడైనా తాము గొడవ చేశామా అని మంత్రి వివేక్ వెంకటస్వామి ప్రశ్నల వర్షం కురిపించారు. తాము ఎలాంటి అధికార దుర్వినియోగం చేయలేదని తేల్చిచెప్పారు. మంత్రి, ఎంపీ కార్లపై రాళ్లు విసరడం సరైనదైనా అని నిలదీశారు. తమపై దాడిని ఖండిస్తున్నామని అన్నారు.

“



ప్రభుత్వం ఆమోదించిన ప్రాజెక్టులు త్వరగా ఏర్పాటవ్వాలి. గూగుల్, ఆర్సెల్లార్ మిట్టల్, బీపీసీఎల్‌వంటి మెగా ప్రాజెక్టులు ఏర్పాటు కావాలి. భూముల కేటాయింపులపైన ఇతరులతో మాట్లాడాలి. ప్రాజెక్టులు ఏర్పాటు చేయకుంటే ఆ భూముల్ని తీసుకోండి. సెమీ కండక్టర్ ప్రాజెక్టులకు ప్రోత్సాహకాలిస్తాం.
- ఏపీ సీఎం చంద్రబాబు

ఓపెన్ వాయిస్

బంగారం ధరలపై రష్యా నిర్ణయం ప్రభావం

రష్యా తీసుకున్న ఒక కీలక నిర్ణయం కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధరలపై పెను ప్రభావం పడే అవకాశం ఉందన్న వార్తలు ఇప్పుడు మదుపర్లలో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. బంగారం ధరలు సామాన్యులకు షాకిస్తున్నాయి. గతేడాది కాలంగా గోల్డ్ ధరలు అంతకంతకూ పెరుగుతూ రికార్డులు క్రియేట్ చేస్తుంది. అటు వెండి సైతం బంగారంతో మించి పైపైకి దూసుకెళ్తుంది. అయితే నిన్నటి వరకు ఆకాశమే హద్దుగా దూసుకుపోయిన పసిడి ధరలు ఇప్పుడు దిగివచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. గత కొంతకాలంగా భారత్‌లో ఒక సావరిన్ (ఎనిమిది గ్రాముల) బంగారం ధర రూ.1,15,000 మార్కును దాటి.. సామాన్యులకు ఆందోళన కలిగించింది. అయితే తాజాగా అంతర్జాతీయ మార్కెట్ లో చోటుచేసుకున్న అనూహ్య పరిణామాలు బంగారం ధరల పతనానికి నాంది పలికాయి. జనవరి 29 నుండి బంగారం ధరల్లో స్థిరమైన తగ్గుదల కనిపిస్తోంది. త్వరలోనే ఇది రూ.1 లక్ష కంటే కిందికి పడిపోయే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. రష్యా తన బంగారు నిల్వలను భారీగా విక్రయించాలని లేదా మార్కెట్‌లోకి వదలాలని తీసుకున్న నిర్ణయం వల్ల సరఫరా పెరిగి ధరలు తగ్గవచ్చని నిపుణులు విశ్లేషిస్తున్నారు. కామెక్స్ గోల్డ్ ధరలు త్వరలో ఔన్సుకి 3,000 డాలర్ల మార్కును తాకే అవకాశం ఉందని విశ్లేషణలు వినిపిస్తున్నాయి. రష్యా కదలికల వల్ల డాలర్ ఇండెక్స్‌లో వచ్చే మార్పులు , భౌగోళిక రాజకీయ పరిస్థితులు పసిడి ధరను ప్రభావితం చేయనున్నాయి. సరఫరా, డిమాండ్ మధ్య ఉన్న సమతుల్యత దెబ్బతినడం వల్ల ధరల్లో తీవ్రమైన హెచ్చుతగ్గులు చోటుచేసుకునే అవకాశం ఉంది. భారతదేశం ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద బంగారం వినియోగదారు కావడంతో, అంతర్జాతీయ మార్కెట్ మార్పులు నేరుగా ఇక్కడి ధరలపై ప్రభావం చూపుతాయి. రష్యా నుండి వచ్చే సమాచారం నిజమైతే, దేశీయంగా 10 గ్రాముల బంగారం ధర గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. అయితే, ఇదే సమయంలో రూపాయి విలువ పతనం వంటి ఇతర అంశాలు కూడా ధరలను నియంత్రించవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. బ్లూమ్‌బెర్గ్ నివేదిక ప్రకారం.. అంతర్జాతీయ వాణిజ్యంలో రష్యా తిరిగి అమెరికా డాలర్‌ను ఉపయోగించాలని నిర్ణయించుకుంది. గతంలో డాలర్‌ను బలహీనపరిచేందుకు రష్యా, చైనా వంటి దేశాలు భారీగా బంగారాన్ని నిల్వ చేశాయి. అయితే ఇప్పుడు రష్యా తిరిగి డాలర్ వైపు మొగ్గు చూపడంతో గ్లోబల్ మార్కెట్‌లో డాలర్ విలువ అనూహ్యంగా పెరుగుతోంది. సాధారణంగా డాలర్ విలువ పెరిగినప్పుడు, అంతర్జాతీయ ఇన్వెస్టర్లు సురక్షితమైన పెట్టుబడిగా భావించే బంగారం నుండి తప్పుకుని డాలర్ వైపు మళ్లుతారు. దీనివల్ల బంగారంపై డిమాండ్ తగ్గి ధరలు పడిపోతాయి. ట్రంప్ విధించిన ఆర్థిక ఆంక్షలను ధిక్కరించేందుకు ప్రపంచవ్యాప్తంగా కొన్ని దేశాలు ఒక కూటమిగా ఏర్పడి డాలర్‌ను కాదని బంగారాన్ని నిల్వ చేశాయి. కానీ రష్యా ఇప్పుడు తన వైఖరిని మార్చుకుని తిరిగి డాలర్ ఆధారిత ట్రేడింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వడం ప్రపంచ వాణిజ్య ముఖచిత్రాన్ని పూర్తిగా మార్చివేసింది. ఇది ప్రపంచవ్యాప్తంగా బంగారం నిల్వలను మార్కెట్లోకి తెచ్చేలా ప్రేరేపిస్తోంది. ప్రస్తుతం హైదరాబాద్, చెన్నై వంటి ప్రధాన నగరాల్లో 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,15,000 వద్ద ట్రేడ్ అవుతోంది. కానీ నిపుణుల అంచనా ప్రకారం.. యుద్ధ వాతావరణం, రాజకీయ అస్థిరత తగ్గడం వల్ల బంగారంపై ఒత్తిడి తగ్గింది. అంతర్జాతీయంగా డాలర్ పుంజుకోవడం వల్ల భారత్‌లో పసిడి ధర లక్ష రూపాయల లోపుకు చేరుకోవడం ఖాయమని తెలుస్తోంది. బంగారం ధరలు తగ్గుతున్నప్పటికీ, కొనుగోలుదారులు ఒకేసారి భారీగా పెట్టుబడి పెట్టకుండా ధరలు పూర్తిగా స్థిరపడే వరకు వేచి చూడటం మంచిదని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. పెళ్లిళ్ల సీజన్ సమీపిస్తున్న వేళ ధరలు తగ్గుతుండటం భారతీయ కుటుంబాలకు పెద్ద ఊరటనిచ్చే విషయమే. రష్యా నిర్ణయం ప్రపంచవ్యాప్తంగా ఎలాంటి ఆర్థిక మార్పులకు దారితీస్తుందో రానున్న రోజుల్లో చూడాలి. గతేడాది బంగారం ధరలు ఏకంగా 70% మేర పెరిగి రికార్డు స్థాయి రూ. 1.80 లక్షలను తాకాయి. అయితే, అంతర్జాతీయంగా ఔన్సు బంగారం ధర ప్రస్తుతం ఉన్న 5,000 డాలర్ల నుండి 3,000 డాలర్లకు పడిపోతే, దేశీయ మార్కెట్ లో 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ. 90,000 నుంచి రూ. 1,00,000 మధ్య స్థిరపడొచ్చని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

ప్రతిపక్షం
హైదరాబాద్
గురువారం
19.02.2026

మేఘాలయలో ప్రపంచంలోనే మొట్టమొదటి వర్షపు మ్యూజియం



యేచన్ చంద్ర శేఖర్
8885050822

భారతదేశంలోని ఈశాన్య రాష్ట్రాలలో ఒకటైన మేఘాలయలోని ఖాసీ కొండలలో ఉన్న మౌసిన్‌రామ్ అనే గ్రామం భూమండలంపైనే అత్యంత తేమతో కూడిన ప్రదేశంగా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది. అత్యధిక సగటు వార్షిక వర్షపాతం కలిగిన ఈ గ్రామంలో వర్షపాతం 11,872 మిల్లీమీటర్లు (460 అంగుళాలకు పైగా) దాటి నమోదయ్యింది. ఈ ప్రాంతంలో రుతుపవనాల ప్రభావం కారణంగా తీవ్రమైన, స్థిరమైన వర్షపాతం నమోదవుతూ రికార్డు స్థాయిలో వర్షాలు కురుస్తాయి. సాధారణంగా ఏప్రిల్ మరియు అక్టోబర్ మధ్య ఈ ప్రాంతంలో ఎక్కువ వర్షం పడుతుంది. ఇక్కడికి కేవలం 15 కి.మీ దూరంలో ఉన్న చిరపుంజి (సోహ్రా) పట్టణం భూమిపై అత్యంత తేమతో కూడిన ప్రదేశాలలో ఒకటిగా గతంలో రికార్డును కలిగి ఉంది. అయితే, మౌసిన్‌రామ్ గ్రామం దాని అధిక సగటు కారణంగా ఈ ఘనతను దక్కించుకుంటుంది. మేఘాలయ ప్రభుత్వం 2026 నాటికి రు.35 కోట్ల అంచనా వ్యయంతో భారతదేశంలోనే కాక ప్రపంచంలోనే మొట్టమొదటి రెయిన్ మ్యూజియం నిర్మించేందుకు ప్రణాళికలు రచించి పెట్టుబడులు పెట్టింది. మేఘాలయ పర్యాటక మంత్రి పాల్ లింగ్దో ప్రకారం, మేఘాలయ బేసిన్ డెవలప్మెంట్ అథారిటి ఆధ్వర్యంలో నిర్మించబడుతున్న ఈ మ్యూజియం స్థానిక జీవనశైలి, గృహనిర్మాణం మరియు దుస్తులు కూడా ప్రత్యకంగా నిరంతర వర్షపాతానికి అనుగుణంగా రూపొందించబడినందున, మౌసిన్రామ్‌ను ఒక ప్రత్యేక పర్యాటక ప్రదేశంగా మార్చడమే లక్ష్యంగా పెట్టుకుంది. వర్షాకాలం చివరి నాటికి రెయిన్ మ్యూజియం మరియు పరిశోధన కేంద్రం నిర్మాణం పూర్తయ్యి ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ఈ మ్యూజియం వర్షపు విజ్ఞానాన్ని, స్థానిక ఖాసీ సంస్కృతిని, వెదురు ఆధారిత నిర్మాణ శైలిని ప్రదర్శిస్తూ, పర్యాటకాన్ని పెంచేలా రూపొందిస్తున్నారు. ఈ ప్రదేశానికి ఎక్కువ మంది పర్యాటకులను ఆకర్షించడం వలన ఉపాధి అవకాశాలు పెరుగడంతో పాటు స్థానికుల జీవన పరిస్థితులు మెరుగుపడతాయని మేఘాలయ ప్రభుత్వం భావిస్తోంది.

ఈ మ్యూజియం ఎందుకు ?

మ్యూజియంలో వాతావరణ కేంద్రం కూడా ఉండడంతో, వర్షం, మేఘాలు, వాతావరణ మార్పులు (క్లైమేట్ చేంజ్), నీటి సంరక్షణ (వాటర్ కన్సర్వేషన్) వంటి అంశాలను శాస్త్రీయంగా, అనుభూతి పరంగా చూపించేలా ఈ ప్రాజెక్ట్ రూపొందించబడుతోంది. ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రపంచంలోనే మొట్టమొదటగా అందుబాటులోకి రానున్న ఈ రైన్ మ్యూజియం ద్వారా సందర్శకులకు వర్షపు చరిత్ర, వాతావరణ శాస్త్రం (మిటియోరాలజీ), పర్యావరణ పరిరక్షణపై (ఎన్విరాన్మెంటల్ ప్రొటెక్షన్) అవగాహన కల్పించడం దీని ముఖ్య ఉద్దేశ్యం. ఈ మ్యూజియం కేవలం పర్యాటకులకు మాత్రమే కాకుండా, విద్యార్థులు మరియు పరిశోధకులను కూడా ఆకర్షించి వర్షం, వాతావరణ మార్పులు మరియు తదితర సంబంధిత విషయాలపై విస్తృత పరిశోధనలు చేపట్టేందుకు అవకాశం కల్పించే వేదికగా మారనుంది.

మేఘాలయ రైన్ మ్యూజియం ముఖ్య విశేషాలు:

వెదురుతో (బాంబూ) కూడిన ఆధునిక పర్యావరణ అనుకూల నిర్మాణం ఈ మ్యూజియం ప్రత్యేకత. మేఘాలయలోని వర్షాధార ప్రాంతంలో ఏర్పాటవుతున్న రెయిన్ మ్యూజియంలో వర్షం ఎలా ఏర్పడుతుంది, పర్యావరణ వ్యవస్థలను ఎలా రూపొందిస్తుంది అనే అంశాలతో పాటు మేఘాలయ రాష్ట్రంలో ఎందుకు అసాధారణ వర్షపాతం పొందుతుంది అనేవి ప్రదర్శించబడతాయి. ప్రదర్శనలలో పరస్పర ప్రభావశీల వ్యవస్థ (ఇంటరాక్టివ్) ద్వారా శాస్త్రీయ ప్రదర్శనలు, భౌగోళిక మరియు వాతావరణ వివరణలు,



సాంస్కృతిక కళాఖండాలు, సహజ దృగ్విషయాలు మరియు స్థానిక సమాజాలు వర్షంతో కలిగి ఉన్న లోతైన సంబంధాన్ని వివరించే కథనాలతో కూడిన అంశాలు ఉంటాయి. శాస్త్రానికి మించి, మ్యూజియం వర్షం మరియు రుతుపవనాల చుట్టూ పెనవేసుకున్న స్థానిక గిరిజన సంస్కృతులు, సంప్రదాయాలు, సంగీతం మరియు జానపద కథల పట్ల సందర్శకులకు గొప్ప అనుభూతిని కలిగించేందుకు కృషి చేస్తుంది. వర్షపాతం రాష్ట్రంలో రోజువారీ జీవితం, వ్యవసాయం మరియు సాంస్కృతిక వ్యక్తీకరణలను ఎలా ప్రభావితం చేస్తుందో ఈ మ్యూజియాన్ని సందర్శించడం ద్వారా పర్యటకులకు అవగాహన కలుగుతుంది. ఇది విద్య మరియు సాంస్కృతిక వారసత్వం యొక్క మిశ్రమ అనుభవంగా మారుతుంది. నిర్మాణం పూర్తయిన తర్వాత, మ్యూజియంలో ఏర్పాటయ్యే అత్యాధునిక పర్యవేక్షణ పరికరాలతో పాటు భారత వాతావరణ శాఖ (ఐఎండి) మరియు భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) వంటి ప్రతిష్టాత్మక సంస్థలతో సంభావ్య సహకారాలతో కూడిన అత్యాధునిక పరిశోధన సౌకర్యం అందుబాటులోకి రానుంది.

ఇతర వర్షా ధార ప్రాంతాలకంటే భిన్నం:

హవాయి లేదా లా రీయూనియన్ వంటి అధిక వర్షపాతం ఉన్న ప్రాంతాలు మహాసముద్రాలు మరియు ప్రభావిత తుఫాను వ్యవస్థలతో చుట్టుముట్టబడిన ద్వీపాలు. అయితే సోహ్రాలో వర్షపాతం అందుకు భిన్నంగా ఒక ప్రత్యేకమైన ప్రక్రియ ద్వారా సంభవిస్తుంది. బంగాళాఖాతం నుండి తేమతో కూడిన మేఘాలు, బంగ్లాదేశ్ యొక్క లోతట్టు మైదానాలను దాటిన తర్వాత, ఖాసీ కొండల దక్షిణ అంచున దాదాపు 4,500 అడుగుల ఎత్తుకు అకస్మాత్తుగా పెరుగుతాయి. ఈ ఆకస్మిక ఆరోహణ, ఈ ప్రాంతంలో తీవ్రమైన సంక్షేపణం మరియు కుండపోత వర్షానికి కారణమవుతుంది. రెయిన్ మ్యూజియం శాస్త్రవేత్తలకు మాత్రమే కాకుండా రోజువారీ సందర్శకులకు కూడా ఈ దృగ్విషయాన్ని అర్థం చేసుకోవడానికి అవకాశం కల్పిస్తుంది.

భూతల స్వర్గం:

ప్రకృతి ఔత్సాహికులకు మరియు సాహస యాత్రికులకు మౌసిన్రామ్ ఒక భూతల స్వర్గంగా అనిపిస్తుంది. ప్రశాంతమైన ఈ గ్రామంలో పచ్చని ప్రకృతి దృశ్యాలు, ఉత్కంఠభరితమైన జలపాతాలు మరియు ఆధ్యాత్మిక గుహలు ఉన్నాయి. నగరాలు మరియు పట్టణాల ఉరుకులు పరుగుల జీవితంతో విసిగి వేసారి, ఆటవిడుపు కోసం జనసమూహం నుండి దూరంగా అందాల ప్రకృతి ఒడిలో కొంత సమయం గడపాలనుకునే వారికి ఈ ప్రాంతం మధురానుభూతిని మిగులుస్తుంది. మౌసిన్రామ్ సందర్శించే పర్యాటకులు ఈ ప్రాంతంలోని అద్భుతమైన సున్నపురాయి గుహలను అన్వేషించడం, వర్షాధార జలపాతాలను వీక్షించడంతో పాటు పొగమంచు దారుల వెంట ట్రెక్కింగ్ చేయవచ్చు. స్థానిక ఖాసీ సంస్కృతిని అవగతం చేసుకుంటూ, సాంప్రదాయ వంటకాలను ఆస్వాదిస్తూ, గ్రామస్తుల హృదయపూర్వక ఆతిథ్యంతో తాదాత్మ్యం పొందవచ్చు. మౌసిన్రామ్ యొక్క అనాఘ్రానిత సహజ సౌందర్యం మరియు ఆకర్షణ స్వచ్ఛమైన ప్రకృతి అనుభవాన్ని కోరుకునే వారికి దీనిని ఒక ప్రత్యేకమైన గమ్యస్థానంగా చేస్తాయి.

(వ్యాస రచయిత మాజీ రాష్ట్ర కార్యదర్శి ది భారత్ స్కౌట్స్ & గైడ్స్, తెలంగాణ)

చాంద్రమాన లయ: ఆత్మను ఉత్తేజితం చేసే రంజాన్ క్రతువు



ముహమ్మద్ ముజాహిద్
9640622076

చాలామందికి, తొమ్మిదవ ఇస్లామీయ మాసపు సంధ్యా సమయంలో ఆకాశంలో కనిపించే అతి సన్నని నెలవంక కేవలం ఒక ఖగోళ సంఘటన మాత్రమే. కానీ కోట్లాది మందికి, అది ముప్పై రోజుల సుదీర్ఘ ఆధ్యాత్మిక మారథాన్‌కు లభించిన ప్రారంభ సంకేతం. రంజాన్ అనేది కేవలం క్యాలెండర్‌లో మారే తేదీ కాదు; అది ఒక 'ఆధ్యాత్మిక వసంతం'. ఆధునిక ప్రపంచపు హోరును తొలగించి, మానవ ఆత్మలోని నిశ్శబ్ద శక్తిని వెలికితీసే ఒక కాలానుగుణ పునరుద్ధరణ ఇది.

క్రమశిక్షణ యొక్క నిర్మాణం

"తక్షణ తృప్తి" (Instant Gratification) కోరుకునే ఈ కాలంలో, పవిత్ర మాసం పట్ల ఇస్లాం అనుసరించే విధానం 'ఉద్దేశపూర్వక మితవాదం' (Deliberate Moderation) కు ఒక నిదర్శనం. చంద్రుడిని చూసిన తర్వాతే ఉపవాసాన్ని ప్రారంభించాలని మరియు ముగించాలని ప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఇచ్చిన ఆదేశంలో ఒక అద్భుతమైన వైశిష్ట్యం ఉంది. ఇది విశ్వాసిని ప్రకృతితో మమేకం చేస్తూ ఒక 'చాంద్రమాన లయ'ను (Lunar Metronome) సృష్టిస్తుంది. ఇది అతి ఉత్సాహంతో ముందే మొదలుపెట్టడం గురించి కాదు; సరైన సమయం కోసం వేచి ఉండటంలోని నిగ్రహం గురించి. మనకు నచ్చిన పనిని చేయడం కంటే, సరైన సమయంలో సరైన పనిని చేయడమే నిజమైన శక్తి అని ఇది మనకు నేర్పుతుంది.

తెల్లవారుజామున నిశ్శబ్దం - సాయంత్రపు కృతజ్ఞత

ఉపవాస ప్రక్రియ 'సహర్' మరియు 'ఇఫ్తార్' అనే రెండు ప్రధాన ఘట్టాల మధ్య సాగుతుంది.

సహర్: ఇది అహంపై చేసే ఒక నిశ్శబ్ద విజయం. ప్రపంచమంతా గాఢ నిద్రలో ఉన్న వేళ, తెల్లవారుజామున విశ్వాసి మేల్కొని అటు శరీరానికి, ఇటు ఆత్మకు అవసరమైన పోషణను పొందుతాడు. ఇది దైవంతో ఏర్పడే అత్యంత సన్నిహిత సమయం; రోజంతా ఆరాధనలో గడపడానికి అవసరమైన ఒక 'పవిత్ర ఇంధనం'.

ఇఫ్తార్: దీనికి విరుద్ధంగా, ఇఫ్తార్ అనేది 'సరళత' నేర్పే పాఠం. రోజంతా కఠినమైన నియమాలతో ఉండి, ఉపవాస విరమణ సమయంలో విందు వినోదాల కంటే,



కేవలం ఒక ఖర్జూరం లేదా నీటి చుక్కతో విరమించడం ఒక అద్భుతమైన అనుభూతి. ఇది సంపన్నులకు ఒక చుక్క నీటి విలువను, ఆకలితో ఉండేవారి పట్ల గౌరవాన్ని గుర్తు చేస్తుంది.

ఆధ్యాత్మిక సార్వభౌమాధికారం

ప్రాథమికంగా 'రోజా' (ఉపవాసం) అనేది ఒక మానసిక విప్లవం. రోజూ సుమారు 16 గంటల పాటు, ఒక విశ్వాసి తన ప్రాథమిక సహజాతాలైన ఆకలి దప్పులను కూడా ఒక ఉన్నత శక్తి (దైవం) యొక్క అధికారానికి లోబడి ఉంచుతాడు. ఇది 'అంతర్గత సార్వభౌమాధికారానికి' గొప్ప నిదర్శనం. ఒక వ్యక్తి చుట్టూ ఎంతటి ఆహార పదార్థాలు ఉన్నా, 'దైవ అనుమతి' లేనిదే అతను దేనినీ ముట్టుకోడు. ఆత్మ అనేది కేవలం శరీరానికి లేదా కోరికలకు బానిస కాదు అని నిరూపించే అత్యున్నత విశ్వాసం ఇది. ఏ ప్రాపంచిక సంస్థ లేదా సామాజిక ఒత్తిడి కూడా ఉపవాసం ఉన్న వ్యక్తి యొక్క సంకల్పాన్ని దెబ్బతీయలేదు; ఇది సృష్టికర్తతో ఆ వ్యక్తి కుదుర్చుకున్న ఒక విడదీయరాని బంధం.

సామాజిక స్పందన

వ్యక్తిగత చర్యలు సమాజంపై ఎలాంటి ప్రభావం చూపుతాయో రంజాన్ ఒక గొప్ప ఉదాహరణ. ఇది ఆచరణాత్మకమైన 'సామాజిక సానుభూతి' (Social Empathy). ఆకలి బాధను స్వయంగా అనుభవించడం ద్వారా, ఒక వ్యక్తిలో 'అంతరాత్మ' మేల్కొంటుంది. ఎదుటివారి కష్టాల్లో మనం పాలుపంచుకున్నప్పుడే వారి బాధను నిజంగా అర్థం చేసుకోగలమనే సందేశం ఇక్కడ కనిపిస్తుంది.

ముగింపు

ముప్పై రోజుల తర్వాత, పాత అలవాట్లకు తిరిగి వెళ్లడం లక్ష్యం కాదు; మరింత క్రమశిక్షణతో, సానుభూతితో కూడిన ఒక నూతన వెర్షన్‌గా బయటకు రావడం అసలైన ఉద్దేశం. ఉన్నతమైన నైతిక లక్ష్యం కోసం మన భౌతిక అవసరాలను త్యాగం చేసినప్పుడు, మనం మనల్ని కోల్పోము——బదులుగా మనల్ని మనం కొత్తగా కనుగొంటాము అని రంజాన్ నిరూపిస్తుంది. ప్రపంచం రోజురోజుకూ రొదతో, గందరగోళంతో నిండిపోతున్న వేళ.. ఉపవాసం ఇచ్చే ఈ నిశ్శబ్దమే అన్నిటికంటే శక్తివంతమైన సందేశం.

(వ్యాసకర్త ఆధ్యాత్మిక రచయిత)



సైద్ధాంతిక విలువల్ని తుంగలో తొక్కిన రాజకీయం



పరాంకుశం రఘు నారాయణ
9949749987

రోజుకో పార్టీ జెండాను మోసే కుటిలనీతి నేడు తెలంగాణలో రాజ్యమేలుతోంది. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేలా నాయకుల అడుగులు పడుతున్నాయి.స్వార్ధ రాజకీయం బుసలు కొడుతోంది.చివరికిది ముష్టి యుద్ధం దాకా అక్కడక్కడా వెళ్లిన సందర్భాలను సైతం మనం ప్రత్యక్షంగా వీక్షించవచ్చు. ప్రజలిచ్చిన ప్రజా తీర్పును సైతం తుంగలో తొక్కి స్థానిక నాయకగణం సరికొత్తదారులు తుకుతోంది.ఎన్నికల రణరంగంలో ప్రత్యర్థి పార్టీపై తీవ్రాతితీవ్రంగా ఆరోపణలు చేసి, తాము చేసే అభివృద్ధి తంత్రాన్ని, సరికొత్త వ్యూహాన్ని ,ఎత్తుగడలను ప్రజాక్షేత్రంలో వాగ్బాణాలతో వాగ్దానాలతో నమ్మబలికి ఎలాగోలా గెలిచిన మరుక్షణమే అదే ప్రత్యర్థి వర్గంలో చేరి ఆ వర్గానికే కొమ్ము కాయడం విడ్డూరం కాదా! ఇది ప్రజా తీర్పును తుంగలో తొక్కినవైనం కాదా! కేవలం పదవుల పందేరంలో భేరంలో జరిగిన స్వల్ప మార్పుకు సంకేతంగా మాయమాటలు చెప్పి పార్టీ ఫిరాయించటం రాజకీయ అనైతిక చర్య కాదా! ప్రజాస్వామ్యంలో సైద్ధాంతికంగా ఒక్కో పార్టీకి ఒక్కో ఏజెండా ఉండటం సహజలక్షణమే.ఈ సైదాంతిక విభేదాలను మరచి శాశ్వత శత్రువులను సైతం తాత్కాలిక ప్రయోజనాలను ఆశించి తప్పటడుగు వేయటం ద్వారా మళ్లీ సమీప భవిష్యత్తులో ఓట్ల వేటలోకీ వెళ్ళితే నీముఖం చెల్లుబాటవుతుందా? మరోసారి ఓట్ల కోసం వెళ్ళినప్పుడు జనం తిరగబడితే,ఒక్కోసారి ఆ నాయకుని జీవితం శాశ్వత సమాధి కాదా!తాత్కాలిక ఒప్పందాలతో ప్రజాక్షేత్రానికి ప్రయోజనం జరిగితే, సర్వత్రా హర్షిస్తారు కానీ తమ వ్యక్తిగతంగా పూర్తిగా స్వంత, స్వార్ధ ప్రయోజనాల కొరకు తన మాతృ పార్టీకి ద్రోహంచేయడం ద్వారా జరిగే శాశ్వత నష్టం ఎలా బేరీజు వేయగలవు. చట్టంలో ఉన్న వెసులుబాటును కాస్తా, వక్రీకరించి,తమకు అనుకూలంగా మార్చుకొని సమాజమంతా కోడై కూసినా కూడా ప్రజా తీర్పును అగౌరవపరుస్తూనే, తాపట్టిన కుందేలుకు మూడేకాళ్ళన్న వైనంగా మొండి వైఖరి అవలంబిస్తే,మాత్రం భవిష్యత్తు కాలంలో ఆ నాయకునికి ప్రజలే అంతిమ తీర్పుతో నడ్డి విరిచేయడం ఖాయం. నూతన పాలకులు ప్రజలిచ్చిన ప్రజాతీర్పును గౌరవిస్తూనే, ఆ సమయంలో నాయకులుగా ఎదగాలంటే మీరిచ్చిన హామీలను నెరవేర్చే క్రమంలో పారదర్శక సూత్రాన్ని అవలంబించి,ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడం ద్వారా అగ్ర భాగాన నిలుస్తారని ఓ పౌరునిగా ఆకాంక్షిస్తూ నేడు తెలంగాణాలో నూతనంగా కొలువుదీరిన పాలకమండలికి శుభాకాంక్షలు తెలుపుతూ ప్రజా సంక్షేమంలో ఆదర్శ నాయకులుగా నిరూపించుకుంటారని భావిస్తున్నాను.

వ్యాసకర్త జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, తొర్రూరు, మహబూబాబాద్ జిల్లా

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com
9010223917

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/
OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

సామాజిక స్ఫూర్తినిచ్చే చిత్రాలను ఆదరించాలి

- 'విధాత' చిత్ర పోస్టర్ ఆవిష్కరణ.
- హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్‌దండి లక్ష్మి



-ప్రతిపక్షం, హుస్నాబాద్, ఫిబ్రవరి18: సమాజంలోని అన్యాయాలను ఎదిరిస్తూ, పేదలు, బలహీన వర్గాల పక్షాన నిలబడే ఒక యోధుడి కథాంశంతో తెరకెక్కిన 'విధాత' చిత్రం అందరినీ ఆలోచింపజేస్తుందని హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల భవనంలో 'తెలుగు వెలుగు సాహితీ వేదిక' ఆధ్వర్యంలో ఈ చిత్ర పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు.ఈ సందర్భంగా దండి లక్ష్మి మాట్లాడుతూ.. కొన్ని వాస్తవ సంఘటనల ఆధారంగా స్వచ్ఛంద సేవ జాతీయ అధ్యక్షులు, డాక్టర్ అప్పినపల్లి భాస్కరాచారి ఈ చిత్రాన్ని నిర్మించారని తెలిపారు. ప్రేక్షకుల్లో స్ఫూర్తిని నింపే ఇలాంటి చిన్న చిత్రాలకు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. త్వరలోనే థియేటర్లలో విడుదల కానున్న ఈ చిత్రాన్ని ప్రేక్షకులు, మీడియా మిత్రులు ఆదరించి విజయవంతం చేయాలని కోరారు.కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ చిత్తారి పద్మ రవీందర్, సింగిల్ విండో మాజీ చైర్మన్ బొలిశెట్టి శివయ్య, కౌన్సిలర్లు వాల సుప్రజ, గాదపాక రవీందర్, స్ఫూర్తి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు పందిళ్ల శంకర్, తెలుగు వెలుగు సాహితీ వేదిక అధ్యక్షులు పోలోజు రాజ్‌కుమార్, కళాకారుడు నాదమునుల రామారావు, గాయకుడు చిట్టి దేవేందర్ రెడ్డి, రచయిత వేముల తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్

ప్రతిపక్షం, మొయినాబాద్, ఫిబ్రవరి 18 : మున్సిపల్ కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ అన్నారు. తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు మొయినాబాద్ మున్సిపల్ కమిటీ ఆధ్వర్యంలో పెండింగ్ వేతనాలు చెల్లించాలని మొయినాబాద్ మున్సిపల్ కమిషనర్ ని కోరారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ మాట్లాడుతూ... మున్సిపల్ కార్మికులు పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తూ ప్రజల ప్రాణాలను కాపాడుతున్నారని, వెంటనే కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించాలని మున్సిపల్ అధికారులు డిమాండ్ చేశారు. అలాగే కార్మికులకు నూతన యూనిఫార్మ్స్,సబ్బులు, నూనెలు, గ్లవ్స్, షూస్ లు, గుర్తింపు కార్డులు, ఈఎస్ఐ కార్డులు, పిఎఫ్ నంబర్ అన్ని వెంటనే ఇవ్వాలని కమిషనర్ గారిని కోరడం జరిగిందని అన్నారు. కమిషనర్ మాట్లాడుతూ... కార్మికుల సమస్యలు పరిష్కారం చేస్తానని పురపాలక సంఘం నుండి అందే అన్ని సామాగ్రిని ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మొయినాబాద్ మండల కన్వీనర్ సిహెచ్ ప్రవీణ్ కుమార్ , మొయినాబాద్ మున్సిపల్ యూనియన్ గౌరవాధ్యక్షులు రత్నం, అధ్యక్షులు సుధాకర్ కోశాధికారి కృష్ణ ఉపాధ్యక్షులు వెంకటేష్, చెన్నయ్య, ప్రవీణ్, నర్సింహా, సామయ్య, జగన్, సుమతి, లక్ష్మి, లత తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా ఉర్సు జాతర వేడుకలు

ప్రతినిధి, కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 18 : కుత్బుల్లాపూర్ నియోజక వర్గంలోని చింతల్ హెచ్ఎంటి రోడ్ లోని ఫైజుద్దీన్ షా ఖాద్రి దర్గాలో సయ్యద్ ఖాజా ఖాద్రి ఆధ్వర్యంలో బుధవారం ఉర్సు జాతర, ప్రత్యేక ప్రార్ధనలు ఘనంగా నిర్వహించారు. ఈ ఉర్సు జాతరలో హెచ్ఎంటి రోడ్ లోని ఫైజుద్దీన్ షా ఖాద్రి దర్గా వారి ఆహ్వానం మేరకు స్థానిక మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం దర్గాలో ముస్లిం సోదరులతో కలిసి ప్రార్ధనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన నియోజకవర్గంలోని ముస్లిం మైనార్టీ ప్రజలందరికీ రంజాన్ మాస ప్రారంభ దిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాజా భాయ్, మక్బుల్, షాకీర్, మహమ్మద్ చోటు, మల్లం శీను, తోకల శీను, స్థానిక డివిజన్ నాయకులు కాంగ్రెస్ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ ఇసుక రవాణాపై ఉక్కుపాదం

- కలెక్టర్ ఇలా త్రిపాఠి



ప్రతిపక్షం, నిజామాబాద్, ఫిబ్రవరి 18 : జిల్లాలో అక్రమ ఇసుక రవాణాను ఏమాత్రం సహించబోమని కలెక్టర్ ఇలా త్రిపాఠి స్పష్టం చేశారు. ఇసుక తవ్వకం, రవాణా పూర్తిగా మన ఇసుక వాహనం (ఆన్‌లైన్) బుకింగ్ విధానం ద్వారా మాత్రమే జరగాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఆఫ్‌లైన్ వే బిల్లులు లేదా అనుమతులు ఇవ్వకూడదని తహసీల్దార్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఆన్‌లైన్ పర్మిట్‌లు లేకుండా ఇసుక రవాణా చేసినట్లయితే సంబంధిత వాహనాలపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఇటీవల సాలూర మండలంలో రెండు అక్రమ ఇసుక రవాణా వాహనాలు పట్టుబడిన ఘటనలను తీవ్రంగా పరిగణించి, సంబంధిత తహసీల్దార్ కు షోకాజ్ నోటీసు జారీ చేసి వివరణ కోరడం జరిగిందన్నారు. ఎవరైనా అక్రమ ఇసుక రవాణా చేసినచో సంబంధిత తహసీల్దార్, పోలీసు అధికారులు వెంటనే కేసు నమోదు చేసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో అక్రమ ఇసుక రవాణా కార్యకలాపాల నిరోధానికి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, పూర్తి స్థాయిలో కట్టడి చేయాలని సూచించారు.

ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ, అక్రమ ఇసుక రవాణాకు సహకరించే అధికారులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని, బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. జిల్లాలో అక్రమ ఇసుక రవాణాను పూర్తిగా అరికట్టడం అధికారుల బాధ్యత అని స్పష్టం చేశారు. జిల్లాలో ఎక్కడైనా ఇసుక అక్రమ రవాణా జరిగితే సంబంధిత అధికారులను బాధ్యులుగా పరిగణిస్తామని అన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించినా, అక్రమార్కులకు సహకరించినా కఠిన చర్యలు చేపడతామని కరాఖండిగా తేల్చి చెప్పారు.

భవిత కేంద్రాలను సందర్శించిన కలెక్టర్....

ఆర్మూర్, నందిపేట్ మండల కేంద్రాలలో గల భవిత సెంటర్లను కలెక్టర్ ఇలా త్రిపాఠి బుధవారం సందర్శించారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల కోసం ఉద్దేశించిన ఈ కేంద్రాలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని అధికారులను ఆదేశించారు. ముందుగా ఆర్మూర్ పట్టణంలోని భవిత కేంద్రంను తనిఖీ చేసి, నిర్వహణ తీరుతెన్నులను క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారు. చిన్నారులను కలెక్టర్ ఆప్యాయంగా పలకరించి కరచాలనం చేస్తూ, వారికి చాక్లెట్లు పంచి పెట్టారు. పిల్లల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, వారిని గాయపర్చే పదునైన వస్తువులు వంటివి లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హితవు పలికారు. యాక్టివిటీ రూమ్, థెరపీ రూమ్, టాయిలెట్స్, ఆఫీసు గదితో పాటు భవిత కేంద్రంలో అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం నందిపేట్ మండల కేంద్రంలో నిర్మాణం జరుగుతున్న భవిత సెంటర్ ను సందర్శించారు. పనులను వేగంగా, నాణ్యతతో జరిగేలా పకడ్బందీ పర్యవేక్షణ చేయాలని ఇంజినీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. చిన్నారులకు అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ర్యాంపు వంటి వసతులు తప్పనిసరిగా ఉండాలని అన్నారు. కలెక్టర్ వెంట ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, జిల్లా విద్యా శాఖ అధికారి పి.అశోక్, ఇంజినీరింగ్ విభాగం అధికారులు జి.రవి, ఉదయ్ కిరణ్ తదితరులు ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా
మున్సిపల్ పాలకవర్గం పనిచేయాలి

- సదాశివపేట మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో నిర్మలా జగ్గారెడ్డి



ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 18 : సదాశివపేట మున్సిపల్ చైర్మన్ గా మునిపల్లి అంజమ్మ సత్యనారాయణ, వైస్ చైర్మన్ రేణుక బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి టీజీఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి ముఖ్య అతిధిగా హాజరయ్యారు. నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్ లను ఈ సందర్భంగా నిర్మల జగ్గారెడ్డి సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం లో మున్సిపల్ పాలక వర్గం ఎల్లప్పుడూ ముందుడాలని సూచించారు. అభివృద్ధి నిధులను సక్రమంగా వినియోగిస్తూ పట్టణాభివృద్ధి కి పాటుపడాలన్నరు. ఈ కార్యక్రమం లో సిడిసి చైర్మెన్ రామ్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు మునిపల్లి సత్యనారాయణ, చిరు, అరుణ్, శరత్ తదితరులు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి కార్యక్రమంలో పాల్గొన్న నిర్మల జగ్గారెడ్డి

సదాశివపేట మండలం మద్ధికుంట, ఏటి గడ్డ సంఘం, తంగెడుపల్లి గ్రామాలలో బుధవారం టీజీఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పర్యటించారు. ఏటి గడ్డ సంఘం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమం లో పాల్గొన్నారు. అనంతరం మద్ధికుంట గ్రామం లో ఇందిరమ్మ ఇళ్ళ గృహ ప్రవేశాల తో పాటు గ్రామంలోని నూతనంగా నిర్మించబోయే స్కూల్ కాంపౌండ్ నిర్మాణానికి ఆమె భూమి పూజ నిర్వహించారు. అదేవిధంగా తంగేడుపల్లి గ్రామం లో సైతం స్కూల్ కాంపౌండ్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమం లో స్థానిక సర్పంచ్ లు, నాయకులు పాల్గొన్నారు.



విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు

- సర్పంచ్ మద్యపాగ కృష్ణ

ప్రతిపక్షం, మొయినాబాద్, ఫిబ్రవరి 18 : విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని అప్జాపూర్ గ్రామ సర్పంచ్ మద్యపాగ కృష్ణ అన్నారు. మండల పరిధిలోని అప్జాపూర్ గ్రామంలో రక్త మైసమ్మ ఆలయం వద్ద 11 కెవి విద్యుత్ ట్రాన్స్ఫార్మాన్ని గ్రామ ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు సరైన విద్యుత్ అందించేందుకు అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. గ్రామంలో ఏ సమస్య తలెత్తిన తన వద్దకు తీసుకువస్తే సమస్య పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని వెల్లడించారు. విద్యుత్ సమస్య పరిష్కారానికి కృషి చేయడానికి సహకరించిన విద్యుత్ అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జితేందర్ రెడ్డి, వార్డు సభ్యులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసును చేధించిన పోలీసులు

- నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించిన పోలీసులు



ప్రతిపక్షం,మొయినాబాద్, ఫిబ్రవరి 18: మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన హత్య కేసును పోలీసులు 24 గంటల్లోనే ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేసినట్లు చేవెళ్ల ఏసీపీ బి. కిషన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్ల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. మృతుడు, నిందితుడు ఒకే ప్రదేశంలో ఉద్యోగం చేస్తుండగా నిందితుడు సంతపురం సిద్దేశ్ కు ఓ మహిళతో అక్రమ సంబంధం ఉండగా మృతుడు ఆ విషయం తెలుసుకుని హెచ్చరించడంతో ఇరువురి మధ్య విబేధాలు ఏర్పడ్డాయని వివరించారు. ఈ నేపథ్యంలో నిందితుడు ఈ నెల 16న మృతుడిని వ్యవసాయ భూమికి తీసుకెళ్లి, గడ్డపార, రాయి. కర్రలతో దాడి చేసి హత్య చేసినట్లు విచారణలో ఒప్పుకున్నాడు.నిందితుడు సంతపురం సిద్ధేశ్ (32) కాశింబౌలి గ్రామం. మొయినాబాద్ మండలంను 18వ తేదీన మధ్యాహ్నం అరెస్ట్ చేయడం జరిగిందని తెలిపారు. హత్యకు ఉపయోగించిన గడ్డపార, నిందితుడు ధరించిన రక్తపు మరకలున్న బట్టలు, చెప్పులు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. నిందితుడిని న్యాయస్థానం ముందు హాజరుపరచగా, 14 రోజుల న్యాయ పరిరక్షణ జ్యుడిషయల్ రిమాండ్ కు పంపించినట్లు పేర్కొన్నారు. ఈ కేసును చేవెళ్ళ ఏసీపీ పర్యవేక్షణలో, మొయినాబాద్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ జి. పవన్ కుమార్ రెడ్డి , దర్యాప్తు చేసి, సబ్ ఇన్స్పెక్టర్లు ఆర్. నర్సింహా రావు , ఎన్. వెంకన్న , క్రైమ్ టీమ్ సిబ్బంది సహకారంతో 24 గంటల్లోనే నిందితుడిని పట్టుకున్నారు. ప్రజలు ఏదైనా అనుమానాస్పద కార్యకలాపాలు గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్కు సమాచారం అందించాలని చేవెళ్ళ ఏసీపీ కిషన్ సూచించారు.



కాంగ్రెస్ నాయకుడు పొన్న శంకర్ రెడ్డి పై సస్పెన్షన్ వేటు!

- మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల ఓటమి కోసం పనిచేయడమే కారణం
- విలేకరుల సమావేశంలో వెల్లడించిన పార్టీ సంగారెడ్డి పట్టణ అధ్యక్షుడు ఎం. జార్జ్

ప్రతిపక్షం సంగారెడ్డి,ప్రతినిధి, ఫిబ్రవరి 18 : సంగారెడ్డి పట్టణానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు పొన్న శంకర్ రెడ్డిపై సస్పెన్షన్ వేటు పడింది. ఆయనను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నామని సంగారెడ్డి పట్టణ అధ్యక్షుడు ఎం.జార్జ్ బుధవారం మీడియాకు వివరించారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో 12వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి ప్రవీణ్ కుమార్ కు వ్యతిరేకంగా పనిచేసిన కారణంగా పొన్న శంకర్ రెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంతకిషన్, సంగారెడ్డి మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ హఫీజ్, పార్టీ సీనియర్ నాయకులు బొంగుల రవి, కూన సంతోష్, మహేష్ముదిరాజ్, కౌన్సిలర్ శ్రీకాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ వ్యతిరేక కార్యకలాపాలే కారణం!

"గతంలో ఎంఎల్ఏ ఎన్నికలలో కూడా కాంగ్రెస్ పార్టీకి పొన్న శంకర్ రెడ్డి వ్యతిరేకంగా పని చేశారు. అప్పుడే సస్పెండ్ చేసినప్పటికీ, అధిష్టానం దగ్గరకు వెళ్లి క్షమాపణలు కోరారు. దీంతో సస్పెన్షన్ ఎత్తి వేశారు. కానీ ఆయన అన్నకొడుకు 12వ వార్డులో బీఆర్ఎస్ పార్టీ టికెట్ పై పోటీ చేసిన సందర్భంగా బీఆర్ఎస్ పార్టీకి అనుకూలంగా శంకర్ రెడ్డి పని చేశారు. పోతిరెడ్డిపల్లిలోని మూడు వార్డులలో కాంగ్రెస్ అభ్యర్థుల ఓటమికి కారణమయ్యారు. కాంగ్రెస్ పార్టీకి నష్టం చేసే దిశగా పనిచేశారు. అందుకే కాంగ్రెస్ పార్టీ నుంచి పొన్న శంకర్ రెడ్డిని సస్పెండ్ చేస్తున్నామని జార్జ్ స్పష్టం చేశారు.



రంజాన్ మాసంలో నిరంతర విద్యుత్ సరఫరా

ప్రతిపక్షం ప్రతినిధి, హనుమకొండ, ఫిబ్రవరి 18; ఎస్పీడీఎస్ఎల్ సిఎండి కర్నాటి వరుణ్ రెడ్డి ఆదేశాల మేరకు, హనుమకొండ నక్కలగుట్టలోని విద్యుత్ భవన్ కార్పొరేట్ కార్యాలయం నుంచి డైరెక్టర్ (ఆపరేషన్) టి. మధుసూదన్ రేపటి నుంచి ప్రారంభమయ్యే రంగజాన్ పవిత్ర మాసాన్ని దృష్టిలో ఉంచుకుని నిరంతర విద్యుత్ సరఫరా కల్పించేందుకు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో సంస్థ పరిధిలోని 17 సర్కిల్ ల సూపరింటెండింగ్ ఇంజనీర్లు, డీఈలు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.




ఏఐ రంగంలో భారత్ అసాధారణ వృద్ధిని సాధిస్తుంది. భారత్ యూఎస్ మధ్య ఏఐ కనెక్టివిటీని పెంచేందుకు సబ్‌సీ కేబుల్ ప్రాజెక్టును ప్రకటించాం. 15 బిలియన్ల డాలర్ల ఏఐ హబ్ ద్వారా భారత్‌లో భారీగా మౌలిక సదుపాయాలు, ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయి. భారత విద్యార్థుల కోసం హిందీ, ఇంగ్లీష్‌లో ప్రత్యేక సర్టిఫికెట్ కోర్సులను ప్రారంభించాం.

- గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్

ప్రాంతీయం

ఉపవాస దీక్షతో అందరికి మంచి జరగాలి

- పవిత్ర రంజాన్ మాసం శుభాకాంక్షలు
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు




ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, పిబ్రవరి 18: పవిత్ర రంజాన్ మాసం ప్రారంభం సందర్భంగా ముస్లిం సోదర, సోదరీమణులకు మాజీ మంత్రి , ఎమ్మెల్యే హరీష్ రావు శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ మాసంలో నిర్వహించే ఉపవాస దీక్షలు, దైవ ప్రార్ధనలతో సామరస్యం, ఆనందం వెల్లివిరియాలని ఆకాంక్షించారు.క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే రంజాన్ మాసం విశిష్టత అని పేర్కొన్నారు. పవిత్ర దివ్య ఖురాన్ అవతరించిన ఈ మాసంలో ముస్లిం సోదర సోదరీమణులంతా నెల రోజుల పాటు కఠోర ఉపవాస దీక్షలతో నిష్టగా అల్లాను ఆరాధిస్తూ ఆధ్యాత్మిక జీవనం కొనసాగిస్తారని అన్నారు. అల్లా రక్షణ, కరుణ పొందాలనే లక్ష్యంతో రంజాన్ మాసంలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తు ప్రతి ఒక్కరూ ఉన్న దానిలో ఎంతోకొంత దానధర్మాలు చేస్తారని అన్నారు. సేవా దృక్పథానికి, సహనానికి ప్రతీకగా ఈ పండుగను జరుపుకోవడం ఎంత సంతోషంగా ఉంటుంది అని అన్నారు. ఈ మాసంలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.



గురువులను సత్కరించిన శిష్యులు

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, పిబ్రవరి 18: వాళ్లంతా ఏడు పదుల వయస్సు దాటిన వారే. వివిధ రంగాలలో లబ్ద ప్రతిష్టులు. తమకు పాఠాలు బోధించిన లెక్చరర్లను వినూత్నంగా సత్కరించారు. సాధారణంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనాలలో గురువులను సత్కరించడం మామూలే. అందుకు భిన్నంగా 51 సంవత్సరాల క్రితం డిగ్రీలో తమకు పాఠాలు బోధించిన మాజీ ఎమ్మెల్సీ, ఐఐటి రామయ్య , మధుసూదన్ , నాగేశ్వరరావు లను హైదరాబాదులోని వారి ఇళ్ల వద్దకే వెళ్లి మంగళవారం శాలువా కప్పి బొకే, పండ్లు అందజేసి సత్కరించారు. 1975లో సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ ఎంపీసీ విద్యనభ్యసించిన తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వ అధ్యక్షులు నందిని సిద్ధారెడ్డి, ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్లుగా పదవీ విరమణ చేసిన డా. నాగభూషణం & కిష్టయ్య, లెక్చరర్ గా రిటైరయినా సంపత్ కుమార్, సీనియర్ జర్నలిస్ట్ కొమురవెల్లి అంజయ్య, వివిధ రంగాలకు చెందిన బి మల్లేశం, నర్సింహారెడ్డి, కే .లక్ష్మీనారాయణ, చింత సత్యనారాయణ, గాల్ రెడ్డి, రామచంద్రమూర్తి, యస్ యన్ చారి, పీ. లక్ష్మీనారాయణ, గౌరయ్య, జగన్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.






రోడ్డు ప్రమాదంలో యువ నాయకుడు మృతి

- సంతాపం ప్రకటించిన ఆర్యవైశ్య సంఘం

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, ఫిబ్రవరి18 : మెదక్ జిల్లా కొల్చారం వద్ద రోడ్డు ప్రమాదం బీసీవై పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షుడు మెదక్ పట్టణానికి చెందిన వనపర్తి రోహిత్ గుప్తా మృతి చెందాడు. వివరాలకి వెళితే మెదక్ పట్టణం చెందిన వనపర్తి రోహిత్ బెజవాడ కనకదుర్గమ్మ అమ్మ వారి దర్శనానికి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో కొల్చారం వద్ద జరిగిన కారు రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే మృతిచెందారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు. మృతదేహాన్ని మెదక్ ఏరియా హాస్పిటల్ కి తరలింపు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న పోలీసులు. వనపర్తి రోహిత్ మృతి చెందడంతో జిల్లా ఆర్యవైశ్య సంఘం సభ్యులు సంతాపం వ్యక్తం చేశారు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మేడిశెట్టి శ్యామ్రావు, మాజీ మున్సిపల్ చైర్మెన్ చంద్రపాల్ మాజీ మున్సిపల్ వైస్ చైర్మెన్ రాగి అశోక్, కార్యదర్శి బచ్చు పార్థివనాథ్, కోశాధికారి కాముని రాధా కిషన్ లతో పాటు పలువురు తీవ్ర సంతాపం ప్రకటించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.యువకుడు, చైతన్యపరుడు చిన్న వయస్సులోనే సమాజ సేవ చేయాలని రాజకీయ రంగంలో ప్రవేశించి, అందరి మన్ననలను పొంది చిన్న వయస్సులోనే ఎమ్మెల్యేగా పోటీ చేసి మెదక్ జిల్లా బీసివై పార్టీ అధ్యక్షులుగా ఉన్న వనపర్తి రోహిత్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం తీవ్రంగా కలచి వేసిందని వారి మరణం సమాజానికి ఆర్యవైశ్య సంఘానికి తీరని లోటని వారు తెలిపారు

కులం పేరుతో మహిళను దూషించిన ఘటనలో నిందితుల రిమాండ్

- మెదక్ డియస్పి డి. ప్రసన్నకుమార్



ప్రతిపక్షం ప్రతినిధి మెదక్ ఫిబ్రవరి17 :- మెదక్ పట్టణంలో మున్సిపల్ ఎన్నికల సందర్భంగా రాజకీయ మద్దతు విషయంలో ఏర్పడిన వివాదం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. కులం పేరుతో మహిళను దూషించడమే కాకుండా, ఎమ్మెల్యే వాహనంపై రాళ్లతో దాడి చేసి చంపాలనే ప్రయత్నం చెసిన ఘటనకు సంబంధించి నిందితులను రిమాండ్‌కు తరలిస్తున్నట్లు మెదక్ డియస్పి డి. ప్రసన్న కుమార్ తెలిపారు. మెదక్ డియస్పి డి. ప్రసన్నకుమార్ వెల్లడించిన వివరాల ప్రకారం.. కాంగ్రెస్ పార్టీ మహిళ కార్యకర్త మున్సిపల్ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా పనిచేస్తూ కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా ప్రచారం నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో 15వ వార్డు బీఆర్ఎస్ అభ్యర్థి భర్త మల్లికార్జున్ గౌడ్ మరియు అతని అనుచరులు ఆమెను బీఆర్ఎస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని కోరారు. అయితే ఆమె ఇందుకు నిరాకరించడంతో, 09 022026తేదీ రాత్రి సుమారు 10 గంటల సమయంలో మల్లిఖర్జున్ గౌడ్ ఆమెను కులం పేరుతో దూషిస్తూ బూతు మాటలు మాట్లాడినట్లు ఫిర్యాదు అందినట్లు తెలిపారు. ఈ ఘటన విషయమై బాధితురాలు స్థానిక ఎమ్మెల్యేకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే ఆమెను పరామర్శించేందుకు బయలుదేరిన సమయంలో, పిట్లం బేస్ చెరువు కట్ట వద్ద బీఆర్ఎస్ పార్టీకి చెందిన కార్యకర్తలు మల్లిఖర్జున్ గౌడ్, జీవన్ రావు, వేణు, హబీబ్, మల్లేష్ తదితరులు కలిపి మొత్తం 23 మంది కలిసి ఎమ్మెల్యే వాహనంపై రాళ్లతో దాడి చేసి చంపాలనే ప్రయత్నం చేసినట్లు తెలిపారు. ఈ దాడిలో వాహనానికి నష్టం వాటిల్లడంతో పాటు ఎమ్మెల్యే మరియు ఆయన అనుచరులకు గాయాలు అయినట్లు పేర్కొన్నారు. దాడిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన ఓ మహిళపై మల్లికార్జున్ గౌడ్ ఛాతిపై చేయి వేసి తోసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. గోదాల అఖిలను కులం పేరుతో దూషించిన ఘటనపై సంబంధిత సెక్షన్లతో పాటు ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలిస్తున్నట్లు డియస్పి తెలిపారు. ఈ కేసులో కొందరు నిందితులు పరారీలో ఉన్నారని, వారిని త్వరలోనే అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలిస్తామని ఆయన స్పష్టం చేశారు. శాంతిభద్రతలకు భంగం కలిగించేలా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తప్పవని తెలిపారు.

జిల్లా ఆస్పత్రి పరిశీలించిన 'కాయకల్ప' టీం సభ్యులు



ప్రతిపక్షం, గజ్వేల్, ఫిబ్రవరి18: జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి గజ్వేల్ ను బుధవారం నాడు కాయకల్ప టీం సభ్యులు పెద్దపల్లి జిల్లా హాస్పిటల్ నుండి డాక్టర్ జి. విజయ్ డాక్టర్ నీరజ (ఐ సి ఎన్) అనిల్ క్వాలిటీ మేనేజర్,సురేష్ డిస్ట్రిక్ట్ హాస్పిటల్ పాలిటి మేనేజర్ గజ్వేల్ డిస్టిక్ హాస్పిటల్ పరిశీలించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ఆర్ఎంవో డాక్టర్ జి ,విజయ్ మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత పరిసరాల పరిశుభ్రత గజ్వేల్ హాస్పిటల్ నిదర్శనం అన్నారు. కాయకల్ప పథకంలో భాగంగా ముఖ్యంగా ఎనిమిది అంశాల మీద మేము దృష్టి పెట్టిన తాము ప్రతి ఒక్క డిపార్ట్మెంట్ ను క్షుణ్ణంగా పరిశీలించి క్లినికల్ సర్వీసెస్ పరిసరాల పరిశుభ్రత హాస్పిటల్ డెవలప్మెంట్ మెరుగైన వైద్యం కోసం చేస్తున్న విధానాన్ని, ఇన్ఫెక్షన్ కంట్రోల్, హాస్పిటల్ కి వచ్చి రోగులతో స్నేహపూర్వక వాతావరణం శానిటేషన్ వేస్ట్ మేనేజ్మెంట్, హైజిన్ ప్రమోషన్, హాస్పిటల్ యొక్క ప్రశాంత వాతావరణం రోగులకు అందిస్తున్న వైద్యంపై ఆరాధించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సూపరింటెంట్ డాక్టర్ అన్నపూర్ణ, ఆర్ఎంఓ డాక్టర్ రాము, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ ప్రణీత, నర్సింగ్ సూపర్డెంట్ స్వరూపరాణి, సువర్ణ, ఇన్ఫెక్షన్ కంట్రోల్ ఆఫీసర్ మేహరాజ్ భాను, రజిత.సానిటరీ ఇన్స్పెక్టర్ లక్ష్మి ఫార్మసీ ఆఫీసర్స్ విమల, ఎఫ్సిబా, మోహన్ ఫార్మసీ ఆఫీసర్స్ నర్సింగ్ ఆఫీసర్స్, పారామెడికల్ సిబ్బంది, శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.



ఉల్లి తిమ్మాయపల్లిలో వైకుంఠ రథోత్సవం

ప్రతిపక్షం, చేగుంట, ఫిబ్రవరి, 18: చేగుంట మండలం ఉల్లి తిమ్మాయపల్లి గ్రామంలో వైరుకుంట రథోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ సత్యనారాయణ సమక్షంలో దాతలు చేగుంట సర్పంచ్ సంద్రుగు స్రవంతి సతీష్ సంద్రుగు శ్రీకాంత్ కుటుంబ సభ్యుల సహకారంతో వైకుంఠ వ్రతం ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ సత్యనారాయణ పేర్కొన్నారు. వారికి గ్రామ తరపున తరపున రుణపడి ఉన్నామని ఆయన వెల్లడించారు. వేద పండితుల సమక్షంలో రథోత్సవ ఊరేగింపు కార్యక్రమాన్ని ఘనంగా చేపట్టారు.



పాఠశాలలో వంట ప్రక్రియను ప్రతిరోజు ఒక ఉపాధ్యాయుడు పర్యవేక్షించాలి

- ద్యార్థులు భోజనం చేసేంతవరకు దగ్గరుండి చూసుకోవాలి
- జిల్లా కలెక్టర్ హైమావతి

ప్రతి పక్షం, దౌల్తాబాద్, ఫిబ్రవరి 18: ప్రభుత్వ పాఠశాలల్లో రోజుకు ఒక ఉపాధ్యాయుడు వంట ప్రక్రియను పర్యవేక్షిస్తూ విద్యార్థులు భోజనం చేసేంతవరకు దగ్గరుండి చూసుకోవాలని జిల్లా కలెక్టర్ హైమావతి ఉపాధ్యాయులను ఆదేశించారు. బుధవారం దౌల్తాబాద్ మండలంలోని దొమ్మాట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ హైమావతి ఆకస్మికంగా సందర్శించి మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించారు. వంట శాలను పరిశీలించిన పరిశుభ్రత, ఆహార నాణ్యత, మెనూ అమలుపై, ఉపాధ్యాయులను విద్యార్థులను కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ. ప్రభుత్వం నిర్ణయించిన కామన్ డైట్ మెనూ ప్రకారం ప్రతిరోజూ రుచికరంగా, పోషకాహారంతో కూడిన భోజనం వండాలని పంట సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థులకు సరిపడా పరిమాణంలో వండాలని, కడుపునిండా భోజనం అందేలా చూడాలని స్పష్టం చేశారు.వంట ప్రక్రియను రోజూ ఒక ఉపాధ్యాయుడు పర్యవేక్షిస్తూ విద్యార్థులు భోజనం చేసేంతవరకు మానిటరింగ్ చేయాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో కలెక్టర్ దొమ్మట జడ్పీ పాఠశాల హెచ్ఎం ఎండి బాసిత్, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.





కేసీఆర్ను కలిసిన మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీరాం సంగీత రవీందర్

ప్రతిపక్షం, దుబ్బాక, ఫిబ్రవరి 18: దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ గా నూతనంగా ఎన్నికైన శ్రీ రాం సంగీత రవీందర్ లు బుధవారం మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ (కే సి ఆర్) ను దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి తో కలిసి ఎర్రవల్లి ఫార్మ్ హౌస్‌లో మర్యాదపూర్వకంగా కలిసి ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు. అంతకు ముందు మాజీ మంత్రి సిద్ధిపేట ఎమ్మెల్యే హరీష్ రావు ను హైదరాబాద్ లోని తన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. వారి వెంట దుబ్బాక మున్సిపల్ పాలక మండలి సభ్యులు బీఆర్ ఎస్ నాయకులు పాల్గొన్నారు.



ఉత్సాహంగా ప్రెస్‌క్లబ్ క్రికెట్ మ్యాచ్


ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, పిబ్రవరి 18: ఫ్రెండ్లీగా.. ఫ్రెండ్లీగా ప్రెస్ క్లబ్ ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ సందడి చేసింది. ఉత్కంఠభరితంగా, ఉత్సాహంతో సాగిన జర్నలిస్టుల క్రికెట్ మ్యాచ్ క్రీడాస్ఫూర్తిని చాటింది. విజేతగా మీడియా టైగర్స్ జట్టు నిలిచింది.సిద్దిపేట క్రికెట్ స్టేడియంలో జరిగిన ఈ ఫ్రెండ్లీ టోర్నమెంట్ ప్రేక్షకులను ఆకట్టుకుంది. కె. చంద్రశేఖర్ రావు జన్మదినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ జర్నలిస్టుల ఫ్రెండ్లీ మ్యాచ్‌లో సిద్దిపేట ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఆరు జట్లు పాల్గొన్నాయి. మొదటి మ్యాచ్‌లో మీడియా టైగర్స్, సిద్దిపేట వీడియో జర్నలిస్టుల జట్ల మధ్య పోటీ జరిగి, అందులో మీడియా టైగర్స్ విజయం సాధించింది. అనంతరం జరిగిన మ్యాచ్‌లో ఎలక్ట్రానిక్ మీడియా జట్టు లయన్స్ వారియర్స్‌పై గెలుపొందింది. తరువాత గద్దర్ టీమ్, నైట్ రైడర్స్ మధ్య జరిగిన పోటీలో నైట్ రైడర్స్ విజయం సాధించింది. సెమీ ఫైనల్‌లో మీడియా టైగర్స్, ఎలక్ట్రానిక్ మీడియా జట్లు తలపడగా, మీడియా టైగర్స్ ఫైనల్‌కు చేరుకుంది. ఫైనల్ మ్యాచ్‌లో మీడియా టైగర్స్, నైట్ రైడర్స్ మధ్య ఉత్కంఠభరిత పోరు సాగింది. మొదట బ్యాటింగ్ చేసిన నైట్ రైడర్స్ 10 ఓవర్లలో 118 పరుగులు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన మీడియా టైగర్స్ 119 పరుగులు సాధించి విజయం కైవసం చేసుకుంది. ప్రతి మ్యాచ్ 10 ఓవర్ల ఫార్మాట్‌లో సాగగా, ప్రతి పోటీ ఉత్సాహభరితంగా, ఉత్కంఠతో నిండిపోయింది. జర్నలిస్టులు క్రీడాస్ఫూర్తితో ఆడి అందరినీ అలరించారు. కెసిఆర్ క్రికెట్ ట్రోఫీ కార్యక్రమంలో భాగంగా జర్నలిస్టులతో ఈ ప్రారంభ మ్యాచ్ నిర్వహించడం విశేషం. విజేత జట్లకు త్వరలోనే ఎమ్మెల్యే టి. హరీష్‌రావు చేతుల మీదుగా బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

శిఖండి రాజకీయాలకు కేరాఫ్ ప్రతాపరెడ్డి

- మెదక్ ఎంపీ పై అరోపణలు నిరాదారం
- బీజేపీ జిల్లా అధ్యక్షులు బైరి శంకర్



ప్రతిపక్షం, గజ్వేల్, ఫిబ్రవరి 18: బిజెపి నాయకులపై నిరాధారమైన ఆరోపణలు చేస్తూ ప్రజలు మోసగించి శిఖండి రాజకీయాలు చేయాలని చూస్తున్న గజ్వేల్ నియోజకవర్గ బిఆర్ఎస్ ఇంచార్జ్ వంటేరు ప్రతాపరెడ్డికి రాబోయే రోజుల్లో గుణపాఠం తప్పదని బిజెపి జిల్లా అధ్యక్షులు బైరి శంకర్ ముదిరాజు, గజ్వేల్ పట్టణ అధ్యక్షులు దేవులపల్లి మనోహర్ యాదవ్ లు అన్నారు. బుధవారం నాడు పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రతాప్ రెడ్డి, మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు పై చేసిన తప్పుడు ఆరోపణలను ఖండించారు, ఎంపీగా నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలపై తిరుగుతా ఉంటే తూప్రాన్ మున్సిపాలిటీలో గెలిచిన ముగ్గురు బిజెపి కౌన్సిలర్లను అమ్ముకున్నారని నిరాధారమైన ఆరోపణలు చేయడం తగదన్నారు. తమ వర్గానికి చెందిన అభ్యర్థి మున్సిపల్ చైర్మన్ కావాలనే అక్కస్సుతో మీ వర్గానికి చెందిన అభ్యర్థిని చైర్మన్ చేయాలని ఎంపీ దగ్గర కాళ్ల బేరానికి రావడం సిగ్గుచేటు అన్నారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో ఈరోజు ఒక రాజకీయ నాయకుడిలగా కాకుండా ఒక వ్యాపారవేత్తగా అమ్ముడును కొనబడును అనే సంస్కృతి నీది, మళ్ళీ కేటీఆర్ దగ్గరకి వెళ్లి బిఆర్ఎస్ పార్టీలో ఎన్ని డబ్బులు తీసుకుని హరీష్ రావు మీద ఆరోపణలు చేశావు ప్రజలకు తెలుసు అన్నారు. ఎప్పుడు ఏది మాట్లాడితే అది సరైనది అని అనుకోవడం తప్పు ప్రజలు అన్నీ గమనిస్తున్నారు నువ్వు ఏదైతే లేనిపోని ఆరోపణలు చేసి కోట మైసమ్మ గుడిలో ప్రమాణం చేస్తున్నావో అదే గుడిలోకి తడి బట్టల పైన పోదాం ఎంపీ గారికి ఎవరు మూడు కోట్ల రూపాయలు ఇచ్చారో ఆధారాలతో రా లేకపోతే రాబోవు రోజుల్లో గజ్వేల్ ప్రజలు మీకు తగిన బుద్ధి చెప్తారు. ఇప్పటికైనా శిఖండి రాజకీయాలు మానుకొని వెంటనే ఎంపీ మాధవనేని రఘునందన్ రావుకి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ గాడి పల్లి భాస్కర్, వార్డ్ బిజెపి కౌన్సిలర్ రొంటెల శ్రీనివాస్, టెలికం బోర్డు మెంబర్ కమ్మరి శ్రీనివాస్, అసెంబ్లీ కోకన్వీనర్ ఎల్కంటి సురేష్, బిజెపి ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు నత్తి శివకుమార్, జిల్లా కౌన్సిల్ సభ్యులు చెప్యాల వెంకట్ రెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి నాయిని సందీప్, బిజెపి నాయకులు పబ్బ శ్రీనివాస్, శ్రీరామ్ కృష్ణ, పుల్ల రాజు, గడియారం రాజేశ్వరి చారి తదితరులు పాల్గొన్నారు.



గతేడాది తాను జ్ఞానేంద్రియాల సమస్య ఎదుర్కొన్నా. విన్పించడం, వాసన గుర్తించడం లాంటివి చాలాకాలం తెలియలేదు. నడిచేందుకూ ఇబ్బంది పడ్డా. చికిత్సతో పూర్తిగా కోలుకుంటున్నా. మనిషికి జ్ఞానేంద్రియాలు గొప్ప వరం. వాటిని జాగ్రత్తగా కాపాడుకోవాలి. 2025లో షూటింగ్‌ల నుంచి బ్రేక్ తీసుకోవడంతో క్యాన్సర్ అని రూమర్స్ వచ్చాయి.

- మలయాళ సూపర్ స్టార్ మమ్ముట్టి

పిల్లల సోషల్ మీడియా వాడకంపై మరిన్ని ఆంక్షలు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18: పిల్లలు, యువత సోషల్ మీడియా (ఎస్ఎం) వాడకంపై త్వరలో మరిన్ని ఆంక్షలు విధించే అవకాశం ఉందని కేంద్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ అన్నారు. వారికి సోషల్ మీడియా వాడకం మరింత సురక్షితంగా ఉండేలా చేయాలని ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. ఈ అంశంపై అశ్విని వైష్ణవ్ మంగళవారం మీడియాతో మాట్లాడారు. యువత ఎస్ఎం వాడకం విషయంలో మరింత నియంత్రణ విధించాల్సిన అవసరం ఉందన్నారు. ''వయసు ఆధారంగా యూజర్లపై ఆంక్షలు విధించే అంశంపై సోషల్ మీడియా సంస్థలతో ప్రభుత్వం నిరంతరం చర్చిస్తోంది. ఈ విషయంలో ఏది సరైంతో ఆలోచిస్తున్నాం. డీప్ ఫేక్ వంటి కొత్త టెక్నాలజీలు యువత సహా వినియోగదారులకు ప్రమాదకరంగా మారాయి. వినియోగదారుల్ని, సమాజాన్ని సోషల్ మీడియా దుష్ప్రభావం నుంచి రక్షించేలా చూడాలి. ఎస్ఎం సంస్థలు భారతీయ చట్టాలు, రాజ్యాంగ విలువల్ని పాటించాలి. ఎస్ఎం విషయంలో దేశంలో ఉన్న ప్రస్తుత చట్టాలు సరిపోవు. చట్టాల్ని మరింత కఠినతరం చేయాలి. డిజిటల్ ప్లాట్ ఫామ్స్ అయిన నెట్ ఫ్లిక్స్, యూట్యూబ్, మెటా, ఎక్స్ వంటి సంస్థలు దేశ చట్టాల్ని అనుసరించాలి. ఇప్పటికే డీపీడీపీ యాక్ట్ వంటి చట్టాలు రూపొందించాం. పిల్లలు, యువతకు ఎస్ఎం వాడకం నియంత్రించే విషయంలో పార్లమెంట్ కమిటీ సూచనలను పరిగణనలోకి తీసుకోవాలి. సమాజానికి రక్షణ కల్పించే రూల్స్ తేవాలి'' అని అశ్విని వైష్ణవ్ అన్నారు.



విశ్వ వీక్షణం



భారత విద్యార్థుల కోసం వీసా ప్రక్రియ సులభతరం చేస్తాం

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18: భారతీయ విద్యార్థుల కోసం వీసా, అడ్మిషన్ ప్రక్రియను సరళీకరిస్తామని, అలాగే ఫ్రాన్స్‌లో ఇంగ్లీష్ మాధ్యమంలో బోధించే కోర్సులను పెంచుతామని ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ బుధవారం ప్రకటించారు. 2030 నాటికి భారతీయ విద్యార్థుల సంఖ్యను ఏడాదికి 30,000కు పెంచడమే లక్ష్యంగా ప్రధాని మోదీతో కలిసి ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. భారతదేశ పర్యటనలో భాగంగా బుధవారం దిల్లీలో జరిగిన ఉన్నత స్థాయి విద్య, శాస్త్రీయ సమావేశంలో మేక్రాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా దిల్లీలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ క్యాంపస్‌లో ఆయన ప్రసంగిస్తూ, భారత్‌ఫ్రాన్స్ విద్యా సంబంధాలను బలోపేతం చేస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మేక్రాన్, కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జేపీ నడ్డాతో కలిసి, 'ఇండోఫ్రెంచ్ క్యాంపస్ ఆన్ ఏఐ ఇన్ గ్లోబల్ హెల్త్'ను ప్రారంభించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత ఆరోగ్య సంరక్షణ పరిష్కారాలలో ఇరు దేశాల మధ్య సహకారాన్ని పెంచడానికి ఇది ఒక కీలక అడుగు అని అన్నారు. పరిశోధన, ఆవిష్కరణ, సామర్థ్యనిర్మాణం వంటి అంశాల్లో పరస్పర సహకారాన్ని మరింతగా పెంచడం దీని లక్ష్యమని పేర్కొన్నారు. మరోవైపు, ఫ్రాన్స్‌లో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే భారత విద్యార్థులకు ప్రపంచ స్థాయి బోధన, ప్రముఖ పరిశోధనా కేంద్రాల్లో పని చేసే అవకాశాలు లభిస్తాయని మెక్రాన్ చెప్పుకొచ్చారు. ఆంగ్ల మాధ్యమంలో విభిన్న కోర్సులు అందుబాటులో ఉంచడం ద్వారా భారత విద్యార్థులకు మరింత సౌలభ్యం కల్పిస్తామని వెల్లడించారు. ప్రజల జీవితాలను మరింత ఆరోగ్యకరంగా, సురక్షితంగా మార్చడం కోసం అనే ఉమ్మడి ఆకాంక్షతోనే ఇరు దేశాల వ్యూహాత్మక భాగస్వామ్యం కొనసాగుతోందని వ్యాఖ్యానించారు.



పేపర్ కప్పులలో టీ తాగుతున్నారా?



డా. కౌశల్ గోవర్ధన
ఎం.బి.బి.ఎస్, (ఎం.డి, ఇంటర్నల్ మెడిసిన్)
7702417779
వైస్ చైర్మన్, శ్రీ రామానుజ సేవా ట్రస్ట్
డా.ధనుంజయ హాస్పిటల్, హైదరాబాద్

ఈ ఆధునిక ప్రపంచంలో మన జీవనం వేగంగా మారిపోతోంది. ఆ వేగమే మన అలవాట్ల మీద కూడా ప్రభావం చూపుతోంది. అలాంటి వేగంలో మనం ఎక్కువగా కలిసే చోట్లలో, కాఫీ, టీ తాగడానికి ఇప్పుడు పేపర్ గ్లాసులు చాలా వినియోగంలో ఉన్నాయి. అవి సులభంగా ముట్టుకునేందుకు, తేలికగా పట్టుకోవడానికి మనం అలా వాటైపోయింది. ఎందులో కాఫీ కావాలి అనగానే మనం వెంటనే గాజు గ్లాసు కాకుండా.. పేపర్ గ్లాస్ లో వేసి ఇచ్చేయ్ అంటుంటాం. కానీ, వాటి వల్ల కలిగే హాని మనం గమనించడం లేదు...

చాయ్ (టి)అంటే ఇష్టపడని ఉండరు. రోజంతా ఉత్సహంగా ఉంచడంలో టీ పాత్ర తక్కువేమీ కాదు. అయితే చాయ్ తాగే అలవాటు ఉన్న వారు రోడ్డు పక్కన ఉండే స్టాల్స్‌లో కూడా చాయ్ రుచులను ఆస్వాదిస్తుంటారు..

ఈ రకమైన కప్పులను కడగడంలో ఇబ్బంది ఉండదు. సులువుగా చాయ్ తాగి డస్ట్‌బిన్‌లో పారేయొచ్చు. ఒక్కోసారి ఇలాంటి చాయ్ కప్పులను ఇంట్లో కూడా ఉపయోగిస్తుంటాం. నిజానికి ఈ రకమైన కప్పులు శరీరానికి హానికరం..

అయితే మీరు మీ జీవిత ఆయుష్షును చేజేతులా విసిరి పారేసుకుంటున్నట్లే అని, ఈ విషయం ప్రఖ్యాత ఐఐటి ఖరగ్‌పూర్ పరిశోధకుల అధ్యయనంలో వెల్లడయింది. డిస్పోజబుల్ పేపర్ కప్పులలో టీ అందించడం పరిపాటి అయింది. అయితే ఈ పద్ధతిలో తేనీటి సేవనం ఏకంగా ప్లాస్టిక్ పదార్థాలను శరీరంలోకి చొప్పించుకోవడమే అవుతుందని అధ్యయనంలో తేలింది

నిజంగా పేపర్ కప్పులో చాయ్ తాగడం హానికరమా ?

ఈ కప్ లో ఉండే చిన్న ప్లాస్టిక్ పార్టికల్స్ ని ఈ కప్ లో పోసే వేడి వేడి పానీయాలు కంటామినేట్ చేస్తాయని తెలుస్తోంది. అంతే, ఈ కప్స్ లోపల ఒక లైనింగ్ ఉంటుంది, ఈ లైనింగ్ ఈ కప్ ని వాటర్ ప్రూఫ్ చేస్తుంది. ఇది ఆరోగ్యానికి హాని చేయడమే కాదు, ఎన్విరాన్మెంట్ కి కూడా హాని చేస్తుంది, ఎందుకంటే దీన్ని రీసైకిల్ చేయడం దాదాపు అసాధ్యం. ఈ పరిశోధన చేయడానికి 100 మిల్లీ లీటర్ల కప్పులలో వేడి నీరు పోసి పదిహేను నిమిషాలు ఉంచారు. ఆ తరువాత ఈ వేడి నీటిని ఒక స్ట్రాంగ్ మైక్రో స్కోప్ కింద పరీక్ష చేశారు. అప్పుడు ఒక్కొక్క కప్ లో సుమారుగా ఇరవై ఐదు వేల మైక్రో ప్లాస్టిక్స్ ఉన్నట్లుగా కనుగొన్నారు. ఈ నీటిలో హాని కారక లోహాలైన జింక్, లెడ్, క్రోమియం కూడా ఉన్నట్లు కనుగొన్నారు. ఈ పరిశోధన చేసిన వారు చెప్పిన దాని ప్రకారం ఈ విషపదార్థాలు కప్ లోపల ఉండే లైనింగ్ నుండి వచ్చాయి.నీటిలో కనుగొన్న పార్టికిల్స్ ఒక మైక్రాన్ అంత పెద్దగా ఉన్నాయి. ఒక వ్యక్తి సుమారుగా రోజుకి మూడు సార్లు ఇలాంటి కప్ లో నుండి టీ, లేదా కాఫీ తాగితే ఆ వ్యక్తి ఒక రోజులో డెబ్బై ఐదు వేల చిన్న మైక్రో ప్లాస్టిక్ పార్టికల్స్ ని తీసుకున్నట్లు అవుతుంది. ఈ పార్టికల్స్ మాములు కంటికి కనబడనంత చిన్నగా ఉంటాయి. ఈ మైక్రో ప్లాస్టిక్స్ హాని కారక లోహాలైన పెలాడియం, క్రోమియం, కాడ్మియం వంటివి కలుస్తాయి. ఇవి రెగ్యులర్ గా లోపలికి వెళ్తుంటే కొంత కాలం తరువాత క్యాన్సర్ వంటి ప్రమాదకర జబ్బుల బారిన పడే ప్రమాదం ఉంటుంది జాగ్రత్త సుమా..!

ప్లాస్టిక్ కప్పులు సాధారణంగా పాలీస్టైరిన్ (స్టైరోఫోమ్), పాలీప్రొపైలిన్ వంటి వివిధ రకాల ప్లాస్టిక్‌లతో తయారు చేయబడతాయి. పాలీస్టైరిన్ వేడిచేసినప్పుడు స్టైరిన్ అనే రసాయనాన్ని విడుదల చేస్తుంది, ఇది క్యాన్సర్ కారకంగా పరిగణించబడుతుంది. పాలీప్రొపైలిన్ సాధారణంగా సురక్షితమైనదిగా పరిగణించబడుతుంది, అయితే ఇది వేడిచేసినప్పుడు ఇతర రసాయనాలను కూడా విడుదల చేయవచ్చు...

◆ ఒక కప్పుకు 3 మిల్లీగ్రాములు మైక్రో ప్లాస్టిక్ కణాలు శరీరంలోకి వెళ్ళుతుంది , తద్వారా అనారోగ్యానికి గురవుతారు. మైక్రోప్లాస్టిక్స్ తీసుకోవడం ద్వారా మీ రోగనిరోధక శక్తిని ప్రభావితం చేస్తుంది. ప్లాస్టిక్‌లో BPA కంటెంట్ అధికంగా ఉంటుంది, అలాంటి కప్పుల తాగడం వల్ల మన రోగనిరోధక శక్తి తగ్గే ముప్పు పెరుగుతుంది కూడా... ప్లాస్టిక్ కప్పులు మరీ ముఖ్యంగా ప్లాస్టిక్ కప్పుల్లో గర్భిణులు టీ తాగడం అస్సలు మంచిది కాదు. ఎందుకంటే అందులో ఉండే మెట్రో సోమిన్, బిస్సినాల్ కెమికల్స్ గర్భిణీ ఆరోగ్యంతో పాటు పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంపై ప్రభావాన్ని చూపుతుంది.ఈ కప్పులపై తరచుగా సూక్ష్మక్రిములు తిష్టవేసి ఉంటాయి, నోటి లాలాజలాల ద్వారా లోపలికి వెళ్లిపోతాయి. పేపర్ కప్పులను అధికంగా వాడటం ద్వారా బ్యాక్టీరియా పెరుగుదలకు దారితీస్తుంది, తద్వారా మీరు అనారోగ్యానికి గురవుతారు. అందుకే ప్లాస్టిక్ కప్ ల బదులుగా ఏదైనా పానీయాలను గాజు గ్లాసులో తాగడం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. చెమోస్పియర్ జర్నల్‌లో ఇటీవల చేసిన అధ్యయనాల కూడా ఇదే తెలుపుతుంది..

◆ ఎక్కడైనా ఫంక్షన్ చేస్తున్నప్పుడు విందు సమయంలో చాలా వరకు ప్లాస్టిక్ గ్లాసులోనే తాగే నీటిని ఇస్తుంటారు. చాయ్ తాగాలన్నా చాలామంది ప్లాస్టిక్ గ్లాస్, జ్యూస్ తాగాలన్నా ప్లాస్టిక్ గ్లాస్ లోనే తాగుతారు. అయితే ఇదంతా ఎప్పుడో ఒక్కసారి చేస్తే బాగానే ఉంటుంది కానీ ప్రతీ రోజు ఇలాంటి వాటిలో తాగితే మాత్రం అనారోగ్య సమస్యలు కొని తెచ్చుకున్నట్లే . చాలా వేడిగా చాయ్ తాగితే అలవాటున్నట్టైంతే వెంటనే దాన్ని మానుకోండి. గొంతు క్యాన్సర్ మాత్రమే కాదు ఎసిడిఫికేషన్, అల్సర్ వంటి కడుపు సంబంధిత సమస్యలు వేధిస్తాయి. రోజుకు 3 లేదా 4 సార్లు పేపర్ లేదా ప్లాస్టిక్ కప్లో టీ తాగితే అతి సూక్ష్మమైన 75,000 టైనీ ప్లాస్టిక్ పార్టికల్స్ ఒంట్లోకి చేరినట్టే. బయట టీ కొట్లో టీ తాగేవారు ఇది గుర్తుంచుకోవాలి. రోజు మంచి పోషకాలున్న డ్రై ఫ్రూట్స్, కూరగాయలు తినటం ఆరోగ్యానికి చాలా మంచిది. కొన్ని అధ్యయనాలు ప్రకారం.. మీ శరీరంపై ప్లాస్టిక్ కప్పులు తీవ్ర స్థాయిలో సైడ్ ఎఫెక్ట్ కలిగిస్తాయని తెలుస్తుంది. త్వరగా అనారోగ్యానికి గురి చేస్తుంది..

◆ ప్లాస్టిక్ కప్పులో టీ తాగాలా వద్దా అనేది మి వ్యక్తిగత ఎంపిక. ప్లాస్టిక్ కప్పుల వాడకం వల్ల కలిగే నష్టాల గురించి మీరు ఆందోళన చెందుతుంటే, ప్రత్యామ్నాయాలను ఉపయోగించడం మంచిది.

ముఖ్య గమనిక మనమందరం తప్పక పాటించాలి..
మన వ్యక్తిగత అలవాట్లలో ఈ మార్పును తీసుకురావడం ద్వారానే మన ఆరోగ్యం, సహజ వాతావరణాన్ని కాపాడవచ్చు. కాఫీ షాపులకు పోయినపుడు కూడా మీరు మీ స్వంత రీయూసబుల్ కప్పు అంటే(మళ్ళీ మళ్ళీ వాడుకోవడానికి అనువైన కప్పు) తీసుకోవడం ఒక మంచి పద్ధతి. ఇది మన వాతావరణాన్ని కాపాడడంలో సహాయపడుతుంది, అలాగే మన ఆరోగ్యాన్ని సంరక్షిస్తుంది. ఇప్పుడు సమాజంలో ఈ విషయంపై అవగాహన పెరుగుతున్నప్పటికీ, ఇంకా చాలామంది ఈ ప్రమాదాల గురించి తెలియకపోవచ్చు. అందుకే మన ఆరోగ్యం కోసం, మన వాతావరణం కోసం చిన్న మార్పులు మన జీవితంలో చేర్చించుకోవడం చాలా ముఖ్యం.



దుస్తులను లాగడం.. అత్యాచార యత్నమే

- స్పష్టం చేసిన సర్వోన్నత న్యాయస్థానం

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18: మహిళ దుస్తులను లాగడం, వక్షోజాలను తాకడం అత్యాచార యత్నం కిందికే వస్తుందని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. ఈ చర్యలు అత్యాచార యత్నం నేరంగా పరిగణించడానికి సరిపోవంటూ అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ మేరకు చీఫ్ జస్టిస్ సూర్య కాంత్ నేతృత్వంలోని ధర్మాసనం బుధవారం తీర్పు చెప్పింది. కేసు వివరాల్లోకి వెళితే.. ఇంటి వద్ద దిగబెడుతామన్న సాకుతో ముగ్గురు యువకులు 14 ఏండ్ల తన కుమార్తెతో అసభ్యంగా ప్రవర్తించారని, ఆమె ప్రైవేట్ భాగాలను తాకేందుకు ప్రయత్నించారని, ఆమె పైజామా బొందును తెంచారంటూ యూపీలోని కాస్‌గంజ్ జిల్లాకు చెందిన ఒక మహిళ 2022లో పోలీసులకు ఫిర్యాదు చేసింది.



కేసును విచారించిన అలహాబాద్ హైకోర్టు 2025, మార్చి 17న తీర్పు చెబుతూ యువకుల ఈ చర్యలు అత్యాచార యత్నంగా పరిగణించ లేమని పేర్కొంటూ.. అత్యాచార యత్నం ఆరోపణలను కేసు నుంచి ఉపసంహరించాలని ఆదేశించింది. దీనిపై తీవ్ర విమర్శలు రావడంతో ఈ కేసును సుమోటోగా స్వీకరించి విచారించిన సుప్రీం కోర్టు ఆ న్యాయస్థానం ఆదేశాలపై స్టే విధించింది. హైకోర్టు తీర్పు మొద్దుబారిన, అమానవీయ విధానంగా ఉందని వ్యాఖ్యానించిన సుప్రీం కోర్టు.. తీర్పు సందర్భంగా హైకోర్టు చేసిన వ్యాఖ్యలు బాధితురాలిని భయపెట్టే విధంగా ఉన్నాయని పేర్కొన్నది. ఈ విషయంలో హైకోర్టులు, కింది కోర్టులకు మార్గదర్శకాలు జారీ చేయనున్నట్టు తెలిపింది.



5 శాతం ముస్లిం రిజర్వేషన్లు రద్దు

- మహారాష్ట్ర సర్కారు నిర్ణయం

ప్రతిపక్షం నేషనల్ బ్యూర్, ముంబై, ఫిబ్రవరి 18: విద్యా సంస్థలు, ప్రభుత్వ, సెమీప్రభుత్వ ఉద్యోగాల్లో ముస్లింలకు 5 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ 2014లో జారీచేసిన ఉత్తర్వును రద్దు చేస్తూ మహారాష్ట్ర ప్రభుత్వ సామాజిక న్యాయ శాఖ మంగళవారం ప్రభుత్వ తీర్మానాన్ని జారీచేసింది. కాగా, ఇప్పటికే ఈ ఉత్తర్వు దశాబ్దానికి పైగా చట్టపరంగా ఆమోదం పొందలేదు. ప్రత్యేక వెనుకబడిన తరగతిఏ (ఎస్‌బీసీఏ) కింద ముస్లింలను గుర్తిస్తూ ఆర్డినెన్స్ ద్వారా 2014 జూలైలో ప్రభుత్వం 5 శాతం రిజర్వేషన్లు కల్పించింది. అయితే ఈ విధానాన్ని బాంబే హైకోర్టులో సవాలు చేయగా 2014 నవంబర్‌లో దీని అమలుపై హైకోర్టు స్టే విధించింది. నిర్ణీత వ్యవధిలోగా ఆర్డినెన్సును రాష్ట్ర శాసనసభలో ఆమోదించని కారణంగా అది చట్ట రూపం దాల్చకపోవడంతో ఆ ఆర్డినెన్సుకు కాలం చెల్లిపోయింది. అనంతరం స్పెషల్ లీవ్ పిటిషన్‌పై తీర్పు ఇస్తూ ముస్లింలకు రిజర్వేషన్ల కోటాను సుప్రీంకోర్టు పక్కనపెట్టింది. ఆర్డినెన్సుకు కాలం చెల్లి, సుప్రీంకోర్టు నుంచి ఉత్తర్వు జారీ అయినప్పటికీ రాష్ట్రప్రభుత్వం మాత్రం ఇప్పటివరకు అధికారికంగా ప్రభుత్వ ఉత్తర్వును జారీచేయలేదు. ఎట్టకేలకు మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వును జారీచేయడంతో ముస్లిం కోటాకు సంబంధించిన అన్ని నిర్ణయాలు రద్దయిపోయినట్లే. ఇకపైన 5 శాతం రిజర్వేషన్ కింద అడ్మిషన్లు, నియామకాలు జరుగవు.



భారత్ అమెరికా మధ్య సబ్ సీ కేబుల్

భారత్, అమెరికా మధ్య ఏఐ కనెక్టివిటీని పెంచడానికి, 2 కోట్ల మంది ప్రభుత్వ ఉద్యోగులకు శిక్షణ ఇవ్వడానికి, 1.10 కోట్ల మంది విద్యార్థులకు మద్దతు ఇవ్వడం సహా వృత్తి నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు కొత్తగా సముద్ర గర్భంలో కేబుల్ మార్గాలను నిర్మించనున్నట్టు గూగుల్ సీఈవో పిచాయ్ బుధవారం ప్రకటించారు. వైజాగ్‌లో ప్రకటించిన 1500 కోట్ల డాలర్ల ఏఐ హబ్‌లో గిగావాట్ స్కిల్ కంప్యూట్ సౌకర్యం, అంతర్జాతీయ సబ్‌సీ కేబుల్ గేట్‌వే ఉంటాయని అన్నారు.



అర్ధసెంచరీతో దూబే విజృంభణ

- రాణించిన వరుణ్ చక్రవర్తి
- నెదర్లాండ్స్‌పై భారత్ విజయం

ప్రతిష్టాత్మక టీ20 ప్రపంచకప్‌లో డిఫెండింగ్ చాంపియన్ భారత్ వరుస విజయాల జోరు దిగ్విజయంగా కొనసాగుతున్నది. ఇప్పటికే సూపర్ 8 బెర్తు దక్కించుకున్న సూర్యకుమార్ యాదవ్ సేన తమ ఆఖరి లీగ్ పోరులో అదరగొట్టింది. బుధవారం మొతెరా స్టేడియంలో జరిగిన గ్రూపుఏ మ్యాచ్‌లో టీమ్‌ఇండియా 17 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తద్వారా టీ20 ప్రపంచకప్‌లో తమ వరుస విజయాల రికార్డును 12కు పెంచుకుంది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న టీమ్‌ఇండియా..శివమ్ దూబే(31 బంతుల్లో 66, 4ఫోర్లు, 6సిక్స్‌లు) ధనాధన్ అర్ధసెంచరీతో నిర్ణీత 20 ఓవర్లలో 193/6 స్కోరు చేసింది. టాపార్డర్ బ్యాటర్లు అభిషేక్‌శర్మ(0) మరోమారు విఫలమైన వేళ మిడిల్‌లో దూబేతో పాటు హార్దిక్‌పాండ్యా(21 బంతుల్లో 30, 3 సిక్స్‌లు) రాణించడంతో భారత్ పోరాడే స్కోరు అందుకుంది. వాన్‌బీక్(3/56), ఆర్యన్ దత్(2/19) రాణించారు. లక్ష్యఛేదనలో నెదర్లాండ్స్ అద్భుత పోరాటపటిమ కనబరిచింది. టీమ్‌ఇండియా బౌలింగ్ దాడిని సమర్థంగా నిలువరిస్తూ 194 పరుగుల ఛేదనలో 7 వికెట్లు కోల్పోయి 176 పరుగులు చేసింది. బాస్ డీ లిడె(33), లియాన్ కాచెట్(26) తుదికంటా పోరాడారు. వరుణ్ చక్రవర్తి(3/14) మూడు వికెట్లు తీయగా, బ్యాట్‌తో అదరగొట్టిన దూబే (2/35) బంతితోనూ ఆకట్టుకున్నాడు. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో జట్టు విజయంలో కీలకంగా వ్యవహరించిన దూబేకు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది. ఈనెల 21 నుంచి సూపర్ 8 పోరు మొదలుకానుంది. తమ తొలి పోరులో 22న దక్షిణాఫ్రికాతో భారత్ తలపడనుంది. టీమ్‌ఇండియా మరోమారు స్పిన్ బౌలింగ్‌లో ఘోరంగా తడబడింది. టాస్ గెలిచిన కెప్టెన్ సూర్యకుమార్ మరో ఆలోచన లేకుండా బ్యాటింగ్ వైపు మొగ్గుచూపాడు. మెగాటోర్నీ ముందు వరకు ప్రత్యర్థులకు దడపుట్టేలా బ్యాటింగ్ చేసిన అభిషేక్‌శర్మ ముచ్చటగా మూడోసారి సున్నాచుట్టాడు. భారత సంతతి స్పిన్నర్ ఆర్యన్ దత్ వేసిన ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లోనే భారీ షాట్ ఆడబోయిన అభిషేక్ పరుగుల ఖాతా తెరువకుండానే నిరాశగా వెనుదిరిగాడు.



ఆస్ట్రేలియా గెలుపుతో ముగింపు

టీ20 ప్రపంచకప్‌లో దక్షిణాఫ్రికా తమ గ్రూపు ప్రస్థానాన్ని అజేయంగా ముగించింది. బుధవారం జరిగిన పోరులో సఫారీలు 6 వికెట్ల తేడాతో యూఏఈపై ఘన విజయం సాధించింది. అవకాశాలను అనుకూలంగా మలుచుకుంటూ కార్బన్ బాశ్ (3/12), నోకియా(2/28) ధాటికి యూఏఈ 20 ఓవర్లలో 122/6 స్కోరు చేసింది. అలీషాన్ షరాఫ్(45) ఒక్కడే ఫర్వాలేదనిపించగా, మిగతావారు పూర్తిగా తేలిపోయారు. 38 బంతుల్లో 5ఫోర్లు, ఒక సిక్స్‌తో ఆకట్టుకున్న అలీషాన్ రెండు సార్లు ఔటయ్యే ప్రమాదం నుంచి బయటపడ్డాడు. మ్యాచ్ మొత్తంగా సఫారీ ఫీల్డర్లు నాలుగు క్యాచ్‌లు విడిచిపెట్టి యూఏఈ బ్యాటర్లకు చాన్స్ ఇచ్చారు. స్వల్ప లక్ష్యాన్ని సఫారీలు 13.2 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి 123 పరుగులు చేసింది. బ్రెవిస్(36), రికల్టన్(30) దూకుడుగా ఆడారు. ఓపెనర్లు మార్క్మ(◌28), డికాక్(14) జట్టుకు మెరుగైన శుభారంభాన్ని అందించారు. కెప్టెన్ మార్క్మ.◌. యూఏఈ బౌలర్లపై విరుచుకుపడ్డాడు.బ్రెవిస్, రికల్టన్ ఇన్నింగ్స్‌ను గాడిలో పడేశారు. ఈ ఇద్దరు కలిసి మూడో వికెట్‌కు 49 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు.



సూపర్ 8కు పాకిస్తాన్

సూపర్ 8కు అర్హత సాధించాలంటే తప్పక గెలువాల్సిన పరిస్థితుల్లో పాక్ సమష్టి ప్రదర్శనతో ఆకట్టుకుంది. బుధవారం నమీబియాతో జరిగిన పోరులో పాక్ 102 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. పాక్ ఓపెనర్ ఫర్హాన్(58 బంతుల్లో 100 నాటౌట్, 11ఫోర్లు, 4సిక్స్‌లు) సూపర్ సెంచరీతో చెలరేగిన వేళ 20 ఓవర్లలో 199/3 స్కోరు చేసింది. మరో ఓపెనర్ ఆయూబ్(14) నిరాశపరిచినా ఫర్హాన్ ధనాధన్ ఇన్నింగ్స్‌తో పాక్‌కు భారీ స్కోరు అందించడంలో కీలకమయ్యాడు. పసలేని నమీబియా బౌలింగ్‌ను సులువుగా ఎదుర్కొంటూ సాధికారిక ఇన్నింగ్స్ నిర్మించాడు. 57 బంతుల్లో సెంచరీ ఖాతాలో వేసుకున్న ఫర్హాన్.నాలుగో వికెట్‌కు షాదాబ్‌ఖాన్(36నాటౌట్)తో కలిసి 81 పరుగుల అజేయ భాగస్వామ్యాలు నెలకొల్పాడు. ఛేదనలో నమీబియా..ఉస్మాన్ తారీఖ్(4/16), షాదాబ్‌ఖాన్(3/19) ధాటికి 17.3 ఓవర్లలో 97 పరుగులకు కుప్పకూలింది.



ప్రారంభమైన హైదరాబాద్ గోల్ఫ్ ఓపెన్

టీ గోల్ఫ్ ఫౌండేషన్, బౌల్డర్‌హిల్స్ గోల్ఫ్ క్లబ్ సంయుక్తంగా నిర్వహిస్తున్న హైదరాబాద్ గోల్ఫ్ ఓపెన్ బుధవారం అట్టహాసంగా ప్రారంభమైంది. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి దాదాపు 300 మందికి పైగా గోల్ఫర్లు ఈ టోర్నీలో పోటీపడుతున్నారు. ఇందుకు సంబంధించిన ట్రోఫీని టీ గోల్ఫ్ ఫౌండర్ చైర్మన్ డాక్టర్ ఎన్‌ఆర్‌ఎన్ రెడ్డి, మధుసూదన్‌రావు, పాపిరెడ్డి, ప్రశాంత్‌రెడ్డి ఆవిష్కరించారు. తెలంగాణ ప్రత్యేకతను చాటిచెప్పేలా చార్మినార్, బుద్ధ విగ్రహం చిత్రాలను ట్రోఫీపై డిజైన్ చేశారు. గురువారం, శుక్రవారం క్వాలిఫయింగ్ రౌండ్లు, శనివారం ఫైనల్ నిర్వహిస్తామని ఎన్‌ఆర్‌ఎన్ రెడ్డి పేర్కొన్నారు.











అద్భుత బంధానికి అందమైన వేడుక

భార్య సురేఖకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మెగాస్టార్ చిరంజీవి

మెగాస్టార్ చిరంజీవి మరోసారి తన స్టార్‌డమ్‌కు మించి, తనలోని భావోద్వేగాన్ని, కృతజ్ఞతను చూపించారు. తన భార్య సురేఖకు పుట్టిన రోజు సందర్భంగా ఆయన రాసిన హృద్యమైన సందేశం నిజాయితీతో, ఆప్యాయతతో అభిమానుల హృదయాలను గెలుచుకుంటోంది.

''నా ప్రతి అడుగులో నా వెంట నడిచిన సురేఖ కు జన్మదిన శుభాకాంక్షలు" 1980 ఫిబ్రవరి 20న మనం వివాహం చేసుకున్న నాటినుంచి నువ్వే నా బలంగా మారావు. ఈరోజు నీ పుట్టినరోజును, ముందుగానే మన వివాహ వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్న ఈ వేళ నా మనసు కృతజ్ఞతతో నిండిపోయింది. నువ్వే మన కుటుంబానికి కేంద్రబిందువు. అందరినీ ప్రేమతో కట్టిపడిపే శక్తి. నా కుటుంబ సభ్యులను నీ వారిలా చూసుకుని, ప్రతి సందర్భంలో వారికి అండగా నిలబడి, నా తల్లిదండ్రులకు నిజమైన కూతురిలా మారావు. వారు కూడా నిన్ను అంతే ప్రేమతో దగ్గర చేసుకున్నారు. నా విజయానికి రహస్యం ఏమిటి అని ఎవరైనా అడిగితే... అది నా ప్రతిభ, కృషి కాదు — "అది నువ్వే". ఎందుకంటే నువ్వు ప్రతి బాధ్యతను తీసుకున్నావు కాబట్టి నేను నా వృత్తిపై పూర్తిగా దృష్టి పెట్టగలిగాను. ప్రతి కష్టంలోనూ, ప్రతి ఆనంద వేడుకలోనూ మనందరినీ ఒకటిగా నిలబెట్టేది నువ్వే. నువ్వు కేవలం నా భార్య మాత్రమే కాదు... నా బలం, నా అండ, నా ప్రశాంతత. ఈరోజు నీ పుట్టినరోజు సందర్భంగా, అలాగే మన వివాహ వార్షికోత్సవం దగ్గర పడుతున్న ఈ సమయంలో, నా మనసు నుంచి ఒక మాట — నీ వల్లే నేను ఈరోజు ఇలా ఉన్నాను

ఎప్పటికీ ప్రేమతో... ఎల్లప్పుడూ నీతోనే. "

ఈ పోస్టు కేవలం పుట్టినరోజు శుభాకాంక్ష మాత్రమే కాదు... 46 ఏళ్ల అనుబంధానికి ఒక గొప్ప ట్రిబ్యూట్. ప్రతి విజయం వెనుక ఒక మౌనమైన శక్తి ఉంటుందని, మెగాస్టార్ చిరంజీవి జీవితంలో ఆ బలం ఎప్పుడూ సురేఖ గారే అని ఇది గుర్తు చేస్తోంది.



కష్టాలు దాటి... వెలుగులోకి

నభా నటేష్ కెరీర్ పీక్ స్టేజ్‌లో ఉన్నప్పుడే ఒక ప్రమాదం వల్ల ఆమె భుజానికి తీవ్ర గాయమైంది. దీనివల్ల ఆమె దాదాపు రెండేళ్ల పాటు వెండితెరకు దూరంగా ఉండాల్సి వచ్చింది. చివరిగా డార్లింగ్ అనే సినిమాలో చేసింది. అది అంతగా ఆడలేదు, అయితే ఆ కష్టకాలంలో ఎంతో ధైర్యంతో ఆమె పోరాడి, మళ్ళీ పూర్వపు ఫిట్‌నెస్‌ను సాధించింది. ఇప్పుడు వరుసగా కొత్త ప్రాజెక్టులకు సంతకం చేస్తూ తన సెకండ్ ఇన్నింగ్స్‌ను ఘనంగా మొదలుపెట్టింది. నిఖిల్ సరసన 'స్వయంభూ' వంటి భారీ చిత్రాల్లో నటిస్తూనే, ఇలాంటి గ్లామర్ ఫోటోషూట్‌లతో నిత్యం వార్తల్లో నిలుస్తోంది. కష్టాలను అధిగమించి మళ్ళీ వెలుగులోకి రావడం ఆమెలోని ఆత్మవిశ్వాసానికి నిదర్శనం. నభా నటేష్ కేవలం అందం మాత్రమే కాదు, అద్భుతమైన నటనతోనూ మనల్ని అలరించింది. ఇప్పుడు ఆమె చేస్తున్న ఈ అందాల జాతర చూస్తుంటే, రాబోయే రోజుల్లో టాలీవుడ్‌లో మరిన్ని బ్లాక్ బస్టర్ హిట్లు ఆమె ఖాతాలో చేరతాయని స్పష్టమవుతోంది. ఇక సాధారణ ప్రేక్షకులకు కూడా ఆమె హుందాతనం ఎంతో నచ్చుతోంది. తన నవ్వుతో, నటనతో నభా ఇలాగే మరిన్ని తరాల వారిని అలరించాలని, తెలుగు వెండితెరపై తిరుగులేని నటిగా ఎదగాలని కోరుకుందాం.



'విష్ణు విన్యాసం' టీజర్ లాంచ్

కింగ్ ఆఫ్ ఎంటర్‌టైన్‌మెంట్ శ్రీవిష్ణు హిలేరియస్ ఎంటర్‌టైనర్ 'విష్ణు విన్యాసం'తో థియేటర్లలో అలరించబోతున్నారు. నూతన దర్శకుడు యదునాథ్ మారుతీ రావు దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో నయన సారిక కథానాయికగా నటించింది, శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర సినిమాస్ బ్యానర్‌పై సుమంత్ నాయుడు జి నిర్మించారు. ఈ చిత్రం ఈ నెల 28న థియేటర్లలోకి రానుంది. మేకర్స్ ఇప్పుడు హైలీ ఎంటర్‌టైనింగ్ టీజర్ లాంచ్ చేశారు. విష్ణు పాత్రకు జాతకాలంటే పిచ్చి, అతని తండ్రి మాత్రం డబ్బునే దేవుడిలా భావిస్తాడు. చిన్న నిర్ణయం తీసుకునే ముందు కూడా వాస్తు చూసే అతని అలవాటు కథలో హాస్యాన్ని తీసుకొస్తుంది. ఈ గందరగోళ మధ్యలో అతను ప్రేమలో పడతాడు. కానీ ఆ అమ్మాయి అతనికంటే అనూహ్యంగా ప్రవర్తిస్తుంది. ఒక క్షణం ప్రేమగా ఉంటే, మరో క్షణం తనకో అబ్బాయిని వెతకమని అడుగుతుంది. ఈ డైనమిక్‌తో ఒక కొత్త తరహా, క్విర్కీ లవ్ స్టోరీ ఆకట్టుకుంటుంది. టీజర్ ప్రారంభం "Use Headphones" అనే వార్నింగ్‌తో, ఒక సరదా ఎమోజీతో మొదలవుతూ వినోదభరితమైన ప్రయాణానికి ఆహ్వానిస్తుంది. ప్రపోజల్, కిస్ సీన్లు యూత్‌ఫుల్ హ్యూమర్‌తో ఆకట్టుకుంటాయి. కథనాన్ని వినూత్నంగా, అత్యంత ఫన్నీగా ప్రెజెంటర్ చేశారు దర్శకుడు యదునాథ్ మారుతి రావు. కామెడీలో తన ప్రత్యేకతను మరోసారి నిరూపించారు శ్రీ విష్ణు. ఆయన టైమింగ్, రియాక్షన్స్ ప్రేక్షకులకు నవ్వులు పంచాయి. నయన సారిక పాత్రలోని ఆఫ్‌బీట్ ఛార్మ్ కామెడీని మరింత పెంచుతుంది. వారి కెమిస్ట్రీ సరదా అల్లరి, యూనిక్ డైలాగ్స్ తో మెప్పిస్తుంది. సపోర్టింగ్ కాస్ట్ లో సత్య, బ్రహ్మాజీ, ప్రవీణ్, మురళీ శర్మ, శ్రీకాంత్ అయ్యంగార్, సత్యం రాజేష్, శ్రీనివాస్ వడ్లమాని, గోపరాజు రమణ వంటి నటులు ఉండటంతో నవ్వుల వర్షం ఖాయం.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200